# చిత్రం

## (నాటకం)

✶ ఈ నాటకం దూరదర్శన్‌లో టెలీఫిల్మ్‌గా రూపొందించబడి అనేక సార్లు ప్రాయోజిత కార్యక్రమంగా ప్రసారమయినది.

# చిత్రం

(నాటకం)

## పాత్రలు

1. చంద్రశేఖర్ రావు
2. లచ్చన్న
3. రైటర్ కందుల
4. బాలు
5. శివరాం
6. ఆగిశం నీలకంఠప్ప
7. శోభ
8. విలేఖరి

# చిత్రం

## నాటకం

(అది సినిప్రొడ్యూసర్ ఇల్లు. చాలా రిచ్‌గా ఉంది. తెరలేచేసరికి ప్రొడ్యూసర్ ఎదురుగా ఓ విలేఖరి ఉన్నాడు. విలేఖరి పేపర్ చదువుతున్నాడు.)

**విలే** : శాంభవి మూవీస్ వారి తదుపరి చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో ఈనెల 12వ తారీఖున ఘనంగా జరుగుతుంది. ఈ ఉత్సవానికి, ఇటు చిత్ర పరిశ్రమలోను, అటు రాజకీయ రంగంలో ఉన్న అనేకమంది ప్రముఖులు హాజరవబోతున్నట్లు ప్రముఖ నిర్మాత, దర్శకులు శ్రీ చంద్రశేఖర్‌రావు తెలియజేసారు. ఈ సినిమాలో ప్రముఖ క్రేజీ హీరో శివరాం నటిస్తుండగా, ఆయన సరసన గజలా, ఆర్తి అగర్వాల్ ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు. వాళ్ళే కాకుండా రాశి, రిచా అతిథి పాత్రల్లోను, రమ్యకృష్ణ మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు తెలియచేసారు. కవరేజ్ బాగుందా సార్!

**ప్రొ** : ఆ! చాలా బాగావచ్చింది. థ్యాంక్స్!

**విలే** : మా పేపర్లో వచ్చినట్లు, ఇంకో పేపర్లో రాలేదు.

**ప్రొ** : థ్యాంక్స్!

**విలే** : థ్యాంక్స్ ఓ.కె. మీ ఫోటో కూడా వచ్చింది. చూసారా!

**ప్రొ** : థ్యాంక్స్!

**విలే** : థ్యాంక్స్ సరే! స్కూల్స్ ఓపెనయ్యాయి. పిల్లలకు ఫీజులు, యూనిఫారాలు, పుస్తకాలు, Expenditure month ఇది. కావాలంటే మరో రెండు రోజులు పోయాక ఫుల్ కవరేజిస్తా!

**ప్రొ** : (పర్స్‌లోంచి కొన్ని నోట్లు తీసిచ్చాడు) సిన్మాలు తీసి బతికేవాడి కన్నా రోడ్డు మీద చెత్త తీసుకుబతికే వాడు బెటరు.

**విలే** : డెఫినిట్‌గా

**ప్రొ** : ఆ!

**విలే** : ఎందుకంటే చెత్తతీసేవాడు సమాజానికి ఆరోగ్యాన్నిస్తున్నాడు.

**ప్రొ** : మేము అనారోగ్యాన్నిస్తున్నామా?

**విలే** : ఆ మాట నేను అనలేను గానీ, మీరంటే మాత్రం ఒప్పుకోకుండా ఉండలేను.

ప్రొ : మొత్తానికి విలేఖరి బుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు.

విలే : ఇంతకు మీ సిన్మా కథేంటండీ!

ప్రొ : ఇప్పటివరకు మా బేనర్లో వచ్చిన సిన్మాలకు భిన్నంగా ఉంటుంది.

విలే : కథేంటో చెబితే భిన్నమో కాదో మేము చెబుతాం.

ప్రొ : ఇప్పుడు కాదు తర్వాత చెబుతాను.

విలే : పోనీ హీరో పాత్రేంటో చెప్పండి.

ప్రొ : వెరైటీగా ఉంటుంది.

విలే : వెరైటీ ఏంటో చెప్పాలి కదా!

ప్రొ : ఇప్పుడు కాదులే

విలే : పోనీ హీరోయిన్ వేషం ఏంటో!

ప్రొ : ఆ... డిఫరెంట్‌గా ఉంటుంది.

విలే : ఆ డిఫరెన్స్ ఏమిటని అడుగుతున్నాను.

ప్రొ : ఇప్పుడు మేము తియ్యబోయే క్లైమాక్స్ ఏ సిన్మాలో ఎవ్వరు తియ్యలేదు. టోటల్ డిఫరెన్ట్‌గా, రిచ్‌నెస్‌తో తియ్యబోతున్నాం. కథలో ఓ వైవిధ్యం కథనంలో ఓ కొత్తదనం, ఫైట్స్‌లో ఇంక చెప్పనక్కర్లేదు. కథ మొత్తం ఇండియన్ స్క్రీన్ మొత్తం మీద first of its kind అనిపించేలా తీస్తున్నాం – చాలా ఇంకా కావాలా!

విలే : ఇంకా కావాలా అని అడుగుతారేంటండీ! ఇంకో రెండు పెద్దనోట్లు ఇలా పడేయ్యండి.

ప్రొ : నేనడిగింది నోట్లు గురించి కాదు. వివరాలు గురించి.

విలే : నేనడుగుతున్నది మీరిచ్చే వరాల గురించి. ఇలా మరో రెండు పడేయ్యండి – ఇలా ఇవ్వండి

ప్రొ : (నోట్లుఇచ్చి) బాగా రాయాలి గురూ!

విలే : చూడండిసార్! మీకు చెప్పేటంతటోడ్ని కాదు గానీ నేను చెబుతుంది నిజం. వేలకు వేలు పోసి ఆ ఎలక్ట్రానిక్ మీడియాలో పబ్లిసిటీ ఇస్తారు. ఎవరు చూస్తారండి. టి.వి. చూస్తూ చూస్తూ తల అలా తిప్పేసరికి ఇలా బొమ్మ మాయమైపోతుంది. అదే ప్రింట్ మీడియా ఉందనుకోండి – పేపర్‌లో ఒక బొమ్మేసి ఒక ఐటమ్ వేస్తే పేపర్ కొన్నవాడు చదువుతాడు. ప్రక్కింటి వాడు చదువుతాడు. టీపాయ్ మీద పడేస్తే ఇంటికొచ్చిన గెస్ట్‌లు చదువుతారు. ఆ పేపర్లో ఓ చొక్కా చుట్టి ఇస్త్రీకి తీసుకెళ్ళామనుకోండి. ఇస్త్రీవాడు చదువుతాడు.

పాతపేపరు కొనేవాడికి అమ్మేశారనుకోండి, అది కొన్న షాపువాడు చదువుతాడు. వాడు ఏ బజ్జీల బండి వాడికో అమ్మాడనుకోండి. బజ్జీల బండివాడు చదువుతాడు. ఆ పేపర్లో బజ్జీలు కట్టి ఏ కష్టమర్‌కో ఇచ్చారనుకోండి – ఆ బజ్జీలు తినే కష్టమర్ చదువుతాడు. చూస్కోండి ప్రింటు మీడియాకున్న రేంజ్ ఏంటో! పైగా నేను రాస్తున్నది Paid Ad కాదుగా! Free ఆర్టికల్. సరే నా ఇంట్లో ఆర్టికల్స్ కొనుక్కోవడానికి కొంత Pay చేస్తున్నారు. నేను తీసుకుంటున్నాను. కాని మా ప్రెస్ వాళ్ళకిచ్చే ప్రతి పైసా వేస్ట్ కాదు. అది విషయం. ఇంకో వెయ్యి ఈ కవర్లో పాడేయ్యండి మీ సినిమా ఓపినింగ్ దగ్గర్నుండి క్లోజింగ్ వరకు కవర్ చేసుకొనే పూచీనాది.

**ప్రొ** : బాగా రాయాలి మరి

**విలే** : అది నేన్జూసుకుంటాను. ఇంతకి మీ సిన్మా కథేంటి సార్!

**ప్రొ** : అది తెలిస్తే నీకు రెండు వేలెందుకు దొబ్బెట్టుకుంటాను.

**విలే** : ఓహో ఇంకా కథ నాట్ రడీ అనుకుంటాను.

**ప్రొ** : అవును.

**విలే** : అయినా మీరేమీ వర్రీ కావద్దు. మీరు కథలేకుండా సిన్మా తీస్తున్నారంటే, నేను వివరాలు లేకుండా వార్త రాసేస్తాను. ఇంతవరకు ఇటువంటి కథ ఇటు దక్షిణాదిలో కాని అటు ఉత్తరాదిలో గాని, ఇటు బాలీవుడ్‌లో గాని అటు హాలీవుడ్‌లో గాని రాలేదని వ్రాసి పారేస్తాను. న్యూస్ పంపే టైం అవుతుంది. వస్తాను. (అసిస్టెంట్ డైరెక్టర్ బాలు వచ్చాడు)

**ప్రొ** : వచ్చావా! రా! మొన్ననగా కథ వినిపిస్తామని హీరోకి చెప్పాం. మొన్నలేదు. నిన్నలేదు. ఈ రోజైనా వినిపించకపోతే ఎలాగయ్యా బాలు! ఎక్కడయ్యా రైటర్.

**బాలు** : ఈరోజు వస్తాడు సార్

**ప్రొ** : ఎప్పుడు? ఎప్పుడొస్తాడు? మొన్న చెప్పిన మార్పునైనా చేసాడో లేదో కనుక్కో.

**బాలు** : (ఫోన్ దగ్గరకు గబగబ వెళ్ళాడు. ఫోన్ ట్రై చేసాడు) హలో! రైటర్ కందుల గారు లేరమ్మా?.. బయల్దేరారమ్మా! ఎంతసేపయిందమ్మా... మన ఆఫీసుకే బయల్దేరారండి.

**లచ్చన్న** : (ఆఫీస్ బోయ్ లచ్చన్న కప్పులు తెచ్చి టీపాయ్ మీదపెడుతూ) అంతేలెండి! పెరట్లో మొక్క వైద్యానికి పనికిరాదని బ్రహ్మాండమైన సూపర్ డూపర్ హిట్టయ్యే కథ చెప్తానంటే వినరు.

**ప్రొ** : ఒరేయ్ లచ్చిగా!

**లచ్చు** : లచ్చిగా ఏంటండీ! నా పేరు లచ్చన్న అయితే.....

(ఈ లోగా ఫోన్ రింగ్ అయింది. ప్రొడ్యూసర్ కంగారుపడ్డాడు)

**ప్రొ** : చూడు. హీరో దగ్గర్నుండేమో! ఆగు! కథ గురించి అడిగితే....

**బాలు** : ఏం చెప్పాలి?

**ప్రొ** : రైటర్ రెడీ. కథ రెడీ. ఓబరాయ్‌లో సూట్ రెడీ. ప్రొడ్యూసర్ మీ కోసమే బయల్దేరారని చెప్పు.

**బాలు** : (ఫోన్‌లో) హలో సార్! నమస్తే సార్! ఎవరు మీరు! (ప్రొడ్యూసర్‌తో) డైలాగ్ రైటర్!

**ప్రొ** : ఏవంటాడు!

**బాలు** : డైలాగ్ వర్షన్ ఎప్పుడు ప్రారంభించాలని అడుగుతున్నాడు.

**ప్రొ** : (ఇలా ఇవ్వు ఫోన్ తీసుకున్నాడు) హలో! పప్పే ఇంకా రుబ్బలేదు. పొయ్యిమీద పెనం ఎప్పుడు పెట్టాలంటే ఏం చెబుతాం! రుబ్బు తయారయ్యాక వచ్చి గారెలు వేద్దావుగానీ .... ఫోనుపెట్టెయ్! ఏంటీ అంతవరకు ఆగలేవా? ఆగలేకపోతే దొబ్బెయ్ .... తెలుగు ఇండస్ట్రీలో కథలు చెప్పేవారు లేరు గానీ, డైలాగులు రాసేవారు బొచ్చుడు మంది ఉన్నారు. (ఫోను పెట్టేశాడు). (లోనుండి ప్రొడ్యూసర్ కూతురు శోభ ఒక చేత్తో హారతిపళ్ళెం, మరో చేత్తో గంట వాయించుకుంటూ వచ్చింది. ఆమెకు 19 సం॥రాలు ఉంటాయి. చాలా వినయంగా ఉంది అమ్మాయి.)

**శోభ** : నాన్నా! హారతి

(ప్రొడ్యూసర్ గబగబా చెప్పులు విప్పేసి హారతి కళ్ళకు హత్తుకుంటాడు)

**ప్రొ** : నా తల్లీ! నా తల్లీ! మీరు తీసుకోండి హారతి.

(అ॥డై॥ బాలు, ఆఫీస్‌బోయ్ లచ్చన్న హారతి తీసుకున్నారు. అమ్మాయి లోనకు వెళ్ళిపోయింది. దానెమ్మా! హీరోకాల్షీట్స్ దగ్గర పడుతున్నాయి. కథ ఇంకా తయారు కాలేదు. ఎడ్వాన్స్ దొబ్బెట్టుకున్నాం. ఇప్పుడెలా చచ్చేది?

**లచ్చు** : ఆ రైటర్ రాదు గానీ, నా కథ ట్రై చెయ్యండి సార్!

**ప్రొ** : నీ కథ తియ్యాల్సిన పరిస్థితి వస్తే – అనగనగా ఒక రాజు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. ఆ ఏడుగురు ఏడు చేపలు తెచ్చారని కథ ఉంది. చూడూ దాన్ని తీస్తాను. నీ కథమాత్రం తియ్యను. ఎక్కడయ్యా రైటరూ!

**లచ్చు** : అంతేలెండి. పెరట్లో మొక్కను గదా! (రైటర్ ఎంటరయ్యాడు)

**రైట** : వచ్చేసాను సార్!

ప్రొ : ఏంటింత ఆలస్యం!

రైట : ఏంజేస్తాం సార్! కథ ఎంతకూ ఓ కొలిక్కిరానిదే!

లచ్చు : ఇప్పటికైనా వచ్చిందా!

రైట : రాకపోతే వదుల్తానటండీ!

ప్రొ : ఏదీ చదువు!

రైట : ఊరికే చదవటం కాదు సార్! అస్సలు సినిమా ఓపెనింగ్ అదిరిపోతుంది సార్! టైటిల్స్ అయ్యాయి – ఒక పెద్ద బ్యాంగ్! స్క్రీనంతా బ్లాకుంది సార్.... ఆ బ్లాక్‌లో ఎక్కడో ధడేల్ ధడేల్ మని శబ్దం. ప్రేక్షకులు సీట్లోంచి ధడేల్న క్రింద పడినట్టు ఫీలయ్యారు. కెమెరా Wide కి వచ్చా – దూరంగా ఒకమ్మాయి పరుగెడుతోంది – పరుగెడుతోంది

ప్రొ : ఒకమ్మాయి –

రైట : అవున్సార్ – అయితే అది అమ్మాయని చెప్పం రెండు కాళ్ళు మాత్రమే..... రన్...రన్...రన్ ఇప్పుడు షడన్‌గా నాలుగు కాళ్ళు ఫ్రేమ్‌లోకి వచ్చాయి.

ప్రొ : ఏదైనా జంతువా!

రైట : కాదు ఇద్దరు మగాళ్ళు ... ముందు అమ్మాయి – ఆమెను వెంబడిస్తూ ఇద్దరు మగాళ్ళు అమ్మాయికాళ్ళు... మగాళ్ళ కాళ్ళు... ఇలా వెళ్తున్నాం.... వెళ్తున్నాం... ఒకచోట బోర్లాపడింది.

ప్రొ : ఏంటి సినిమానా

రైట : కాదు అమ్మాయి

ప్రొ : కథను నువు ఇంత సినిమాటిక్‌గా చెప్పక్కర్లేదు – మామూలుగా కథేంటో చెప్పు.

రైట : మామూలుగా చెప్పేయమంటారా ! ఒ.కే. అయితే! ఇప్పుడు......

లచ్చు : (తుమ్మాడు)

ప్రొ : ఆపు! ఆదిలో హంసపాదు! మీరు సీట్లు మారండి. ఇదిగో బాలు నువ్విక్కడ కూర్చోవయ్యా! నువ్విటురా! (బాలు, రైటరు సీట్లు మారారు)

రైట : (మళ్ళీ ఉపక్రమిస్తున్నాడు) ఇప్పుడు.....

లచ్చు : సార్! టైటిల్ కన్‌ఫర్మ్ చెయ్యలేదు. దాని సంగతి చూడండి ముందు!

ప్రొ : అవునయ్యో మర్చిపోయాను. టైటిల్ Strike అయ్యిందా!

రైట : అయ్యింది సార్! మా బేషుగ్గా కుదిరిపోయిందనుకోండి. స్త్రీకి నుదిటి మీద బొట్టు ఎంత అందంగా అవిరిపోతుందో మన కథకి టైటిల్ కూడా అంత అందంగా కుదిరిపోయింది.

ప్రొ : బాకా వద్దు. టైటిల్ చెప్పు!

రైట : సంసార తిలకం

లచ్చు : (కిసుక్కున నవ్వాడు)

ప్రొ : (లచ్చన్నతో) నువు లోనకెళ్ళి వంటపనిజూడు!

బాలు : అది కాదండి! టైటిల్ ఇప్పటి ట్రెండ్‌లో ఆలోచించమన్నాం కదండీ!

రైట : అదీ....అదీ!

ప్రొ : ఏందయ్యా అదీ.....అదీ....ఇదేమన్నా సినిమా అనుకున్నావా! కాకపోతే సమరం రాసే శీర్షిక అనుకున్నావా. సంసార తిలకం, సుఖఃసంసారం అని టైటిల్ పెట్టడానికి.

బాలు : యూత్‌కి సరిపోయే టైటిల్ కావాలని చెప్పానుకదండీ మీకు.

ప్రొ : చూడూ! పెద్దోళ్ళంతా టి.వి.లకీ అతుక్కుపోతున్నారు. ఏ ఛానల్ పెట్టినా కడవలకి కడవలు కన్నీళ్ళు కార్పించే సీరియల్సే. ఇక థియేటర్‌కి వచ్చేదెవరు? యూత్! యూత్! ఆ యూత్‌ని థియేటర్‌కి రప్పించాలంటే ఎలాంటి టైటిల్ పెట్టాలో తెలీకపోతే ఎలాగ!

రైట : నేన్చెప్పిన టైటిల్ కూడ యూత్‌కి బాగానే ఉంటుందని దాన్ని ఖాయం చేసేశానండీ!

ప్రొ : ఏంటీ ఖాయంచేసేశావా!

బాలు : మీరు ఇరిటేట్ కాకండి సార్! నేను మాట్లాడుతాను. చూడండి కథక్కాని, టైటిల్ కాని ఒక ట్రెండ్, ఒక నావెల్టీ వుండాలి. అవి అంటే ఏంటో చెబుతాను. జాగ్రత్తగా వినండి సార్! ఒక సినిమాలో హీరో గుడ్డి వాడనుకో! ఆ సినిమా హిట్టయ్యిందనుకో తరువాత సినిమాలో హీరోయిన్ గుడ్డిదై పోతుంది. ఆ తర్వాత సినిమాలో హీరో హీరోయిన్లకు పుట్టిన పిల్లలు గుడ్డివారైపోతారు. ఆ తరువాత వచ్చే సినిమాలో వాళ్ళ తల్లితండ్రులు గుడ్డివారైపోతారు. ఒక సీజనంతా గుడ్డితనమే సబ్జెక్ట్ అయిపోతుంది.

లచ్చు : (వస్తూ) ఆ సినిమా పేలిపోయిందనుకో నిర్మాత గుడ్డోడైపోతాడు.

బాలు : ముందు వెళ్ళిన గొర్రెనక మిగిలిన గొర్రెలు వెళ్తాయి. దాన్నే ట్రెండ్ అంటారు. ఒక పేరుగాని, ఒక ఫార్ములాగాని హిట్టయ్యిందనుకో ఇక తరువాత వచ్చే సిన్మాలన్నీ అలాగే ఉంటాయి. అర్థమైందాండీ!

రైట : ఏదో అవుతున్నట్టుంది....

**బాలు** : ఇక నావెల్టీ అంటే ఏంటీ! హిట్టయిన సిన్మాలోని పాత్రలు, సన్నివేశాల్ని తీసుకొని – అలాగే వుంటాయి కాని అవి కావు. అవి కానట్టుండాలి. కాని అవే–.

రైట : దాన్ని నావెల్టీ అంటారా! ఇది నాకేమీ అర్థం కావట్లేదు.

ప్రొ : అలా కాదు గాని ఇప్పుడు మీ నాన్న ఉన్నాడా!

రై : ఉన్నాడు. సార్, పాపం!

ప్రొ : మీ నాన్నకు నువు ఏమౌతావు?

రైట : కొడుకుని

ప్రొ : నీకు కొడుకులున్నారా?

రైట : ఒకడున్నాడు.

ప్రొ : వాడికి నువ్వేమౌతావు?

రైట : నాన్నను

ప్రొ : అంటే మీ నాన్నకు నువు కొడుకువి. నీ కొడుక్కి నువు నాన్నవు – మీ నాన్నకు నువు కొడుకువి. నీ కొడుక్కి నువు నాన్నవు – చూసావా? అదే, ఉన్న ట్రెండ్‌లో నావెల్టీ అంటే.

రైట : మా నాన్నకు నేను కొడుకుని – నా కొడుక్కి నేను నాన్నను. మా నాన్నకు నేను కొడుకుని – నా కొడుక్కి నేను నాన్నను.

ప్రొ : అద్దీ.... ఇప్పుడు చెప్పు టైటిల్ ఏమి పెడతామో

రైట : టైటిలూ .... టైటిలూ ....నాకేవీ తట్టడంలేదు.

ప్రొ : బాలు. ఇతనెక్కడ దొరికాడయ్యా! హీరోకి చెప్పడానికి ఒక క్యాచీ టైటిలైనా చెప్పలేకపోతున్నాడు. ఇప్పుడు మహాభారతం మనం సినిమా తీసామనుకో. టైటిల్ ఎలా ఉండాలో తెలుసా?

రైట : ఎందుకు తెలీదండి! మహాభారతం, కురుక్షేత్రం, శ్రీకృష్ణ పాండవీయం – ఇలా ఏటైటిల్ పెట్టినా మహా అద్భుతంగా ఉంటుంది.

ప్రొ : నీ బొందలా ఉంటుంది.

రైట : అయ్యా!

ప్రొ : మహాభారతం ఈ రోజుల్లో తీస్తే టైటిల్ ఎలా ఉండాలో తెల్సా!

**బాలు, రైటర్ :** (ఇద్దరు ఆసక్తిగా వింటున్నారు.)

ప్రొ : కొట్టుకుందాం రా! ఎలా ఉంది.

**బాలు** : అద్భుతం సార్

ప్రొ : అదే రామాయణం తీసామనుకోండి! దాని టైటిల్ ఏంటో తెల్సా!

**బాలు** : అడవికిపోదాం రా! అని పెట్టాలి. అది ప్రజంట్ ట్రెండ్‌లో నావెల్టీ అంటే!

**లచ్చు** : అందుకే ఏమీ తెలియకుండా పదిసినిమాలు డైరెక్ట్ చేసారు.

ప్రొ : ఆ పొడేంటిరా?

**లచ్చు** : అబ్బే ఏం లేదండీ! కష్టమేమీ తెలీకుండా పది సినిమాలు డైరెక్టు చేశారంటున్నాను.

ప్రొ : ఏడిశావ్! వెళ్ళి నాలుగు కప్పుల కాఫీ తీసుకురా!

**లచ్చు** : అలాగే (లోనకు వెళ్ళాడు)

ప్రొ : పోనీ ఆ క్లైమాక్స్ అయినా మార్చావా? లేదా? (రైటర్ తల అడ్డంగా ఊపడం చూసి)

ఏంటి మార్చలేదా?

రైట : మార్చాల్సిన అవసరం లేదనిపిస్తోంది.

ప్రొ : ఒరెయ్ బాలు ఇలాంటి వాడ్ని తెచ్చావేమయ్యా!

**బాలు** : రైటర్ గారూ! పరిస్థితి అర్థం చేసుకోండి! ఇప్పుడున్న ట్రెండ్ ప్రకారం ఆలోచించండి.

ప్రొ : అది కాదండీ. మనం యూత్ మీద సినిమా తీస్తున్నాం. పవర్‌ఫుల్ లవ్ సబ్జెక్ట్ క్లైమాక్స్ కన్విన్సింగ్‌గా లేకపోతే ఎవడు చూస్తాడు. కొత్తగా ఆలోచించండి! కాస్త నోవల్‌గా థింక్ చేయండి. సినిమా ఎలా ఉండాలంటే యూత్ అంటే స్టూడెంట్స్ స్కూళ్ళని, కాలేజీల్ని వదిలేసి థియేటర్స్‌కి పరుగులు తియ్యాలి. పార్కుల్లో, క్లాసుల్లో, రోడ్లమీద యూత్ జట్లు జట్లుగా మన సినిమా గురించి డిస్కషన్స్ చేసుకోవాలి. అప్పుడే మనకు పిచ్చ డబ్బు లొచ్చేస్తాయ్. ఆ ప్రక్కగా కూర్చొని ప్రశాంతంగా ఆలోచించండి!

**బాలు** : మీరిలా రండిసార్! కంగారేం లేదు. కూల్‌గా థింక్ చేయండి. (రైటర్నీ ఓ ప్రక్కకు తీసుకెళ్ళి కూర్చోబెట్టారు) (లోనుండి శోభ వచ్చింది)

(ఇప్పుడా ఆ అమ్మాయి మోడ్రన్ డ్రస్సులో ఉంది.)

**శోభ** : నాన్నా!

ప్రొ : ఏంటమ్మా!.... అయ్యయ్యో ఏంటమ్మా ఈ డ్రస్ వేసుకున్నావు... ఛీ! ఛీ! ఈ డ్రస్సు ఎప్పుడు కొన్నావు.

**శోభ** : ఇది నువ్విచ్చిన పాకెట్ మనీతో కొనుక్కున్నాను. డ్రస్ బాగోలేదా నాన్నా!

ప్రొ : పరమ ఛండాలంగా ఉంది. ఇది తీసేసి ఇంకోటి వేసుకోమ్మా!

శోభ : మరి మీరు తీసిన సిన్మాలో ఆడపిల్లలు ఇలాంటి డ్రస్సులే వేసుకుంటారు కదా నాన్నా!

ప్రొ : ఏంటీ నువు చూసావా! నేను తీసిన సిన్మాలు కొంపదీసి నువు చూసావా!

శోభ : (గతుక్కుమంది) కాదు కాదు... మా ఫ్రెండ్స్ చెప్పారు.

ప్రొ : చూడమ్మా! నీకు సిన్మా చూడాలనిపిస్తే హాయిగా విశ్వనాథ్ గారి సినిమాలు చూడు, బాపుగారి తీసిన సిన్మాలు చూడు – అలాగే పాత సినిమాలున్నాయి – చాలా గొప్పవి! అలాంటివి చూడుగానీ చెత్త సినిమాలు చూడకమ్మా!

శోభ : మరి అలాంటి సినిమాలు మీరెందుకు తీయడం నాన్నా!

ప్రొ : డబ్బుకోసం – అలాంటి సినిమాలు తీస్తేనే జనం విరగబడి చూస్తారు – మనకు తెగ డబ్బులొస్తాయి.

శోభ : డబ్బులుకోసం చెడ్డ సినిమాలు తియ్యడం తప్పుకదా నాన్నా.

ప్రొ : అబ్బా! ఈ వ్యాపార రహస్యాలు నీకు తెలీదుగానీ – నువు మంచి సినిమాలే చూడాలి. బుద్ధిగా చదువుకోవాలి. మంచి మార్కులు తెచ్చుకొని జీవితంలో హేపీగా ఉండాలి.

శోభ : అదికాదు నాన్న! మిగతా వారు కూడా నాలాంటి పిల్లలే కదా! వాళ్ళు మాత్రం చెడు సినిమాలు చూడాలని ఎందుకు కోరుకోవడం.

ప్రొ : అబ్బా! ఎవరెలా పోతే మనకెందుకమ్మా! నాక్కావల్సింది నా వ్యాపారం – నా లాభం..... బాగుండాల్సింది నీ జీవితం... ఆ డ్రస్ తీసేసి లంగావోణీ వేసుకోమ్మా! అచ్చం మహాలక్ష్మిలాగా ఉంటావు.

శోభ : వద్దు నాన్నా! నేను ఈ డ్రస్‌లోనే వెళ్తాను. ఎందుకంటే ఆ లంగావోణీ వేసుకొని వెళ్తే మా క్లాస్‌మేట్సంతా పల్లెటూరి బైతని వెక్కిరిస్తున్నారు. లెక్చరర్స్ కూడా అమ్మమ్మ వొచ్చింది – అమ్మమ్మ వొచ్చిందని ఆట పట్టిస్తున్నారు నాన్నా!... ఈ డ్రస్సు వద్దంటే నేను కాలేజీకైనా మానేస్తాను గాని ఆ పల్లెటూరి డ్రస్సుమాత్రం వేసుకెళ్ళను.

ప్రొ : స్సరి....స్సరే... డ్రస్సులు వేసుకుంటే వేసుకోగానీ, పోకిరి బుద్ధులు మాత్రం నేర్చుకోకు... క్లాసు లెగ్గొట్టి మార్నింగ్ షోలకు, మాట్నీలకు వెళ్ళే గ్యాంగ్ ఉంటుంది వాళ్ళతో మాత్రం తిరగొద్దు...చూడమ్మా! చూసిన వెంటనే ఎవరికైనా మన పట్ల గౌరవం కలిగేలా ప్రవర్తించాలి. గౌరవం ఎప్పుడు కలుగుతుంది. మన మాట, మన బట్టలు, మన నడక, నడత అన్నీ బాగుణ్ణప్పుడే. వీటిలో ఏదాంట్లోనూ ఎవరితోను మనం వేలెత్తి చూపించుకోకూడదు.

శోభ : నువ్వెలా చెబితే అలా చేస్తాను నాన్నా!

ప్రొ : నా బంగారు తల్లి... కొడుకు పున్నమనరకాన్ని తప్పిస్తాడంటారు. కానీ కూతురు స్వర్గాన్నే క్రిందకు తెప్పిస్తుంది. అంత గొప్పగా బతకాలమ్మా నువ్వు. ఒరే వెధవా!...

లచ్చు : నన్నేనా

ప్రొ : ఏం డౌటా

లచ్చు : చెప్పండి!

ప్రొ : ఆ క్రాస్‌రోడ్స్ మీద నుండి తీసుకెళ్ళకు! వెధవ థియేటర్స్ అన్నీ అక్కడే తగలడ్డాయి. (కాస్త నెమ్మదిగా) ఎక్కడైనా బూతు పోస్టర్లవీ కనబడితే కారు వేగంగా పోనీయ్! అమ్మాయి కంట్లో వాటిని పడనివ్వకు. రోడ్డు ప్రక్కన టెంపుల్స్ కనబడితే కారు ఆపు. అమ్మాయి నమస్కారం పెట్టుకుంటుంది. ఏమ్మా! ఆంధ్రుల సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా ప్రవర్తించాలి నువ్వు. ఒరెయ్. వెళ్ళు - వెళ్ళు. (ఫోన్ రింగయింది. బాలు ఫోన్ తీసాడు)

బాలు : హలో! ఆ ఉన్నారండీ! సార్ అమ్మాయిగారికి ఫోన్

ప్రొ : అమ్మా ఫోన్ నీకే!

శోభ : హలో! హాయ్ గీతా! ఆ! బయలుదేరాను! ఏం... ఆ...ఆ...ఆ...! ఒ.కే. అయితే (ఫోన్ పెట్టేసింది) నాన్నా ఈ రోజు కాలేజి లేదట.

ప్రొ : ఏం మీ ప్రిన్సిపాల్ పోయాడా!

శోభ : ఈ వేళ... స్టూడెంట్స్ స్ట్రయిక్ చేస్తున్నారట.

ప్రొ : ఎందుకట

శోభ : "పట్టుకో... పెట్టుకో" సినిమా బేన్ చేసినందుకు స్టూడెంట్ స్ట్రయిక్ చేస్తున్నారు.

ప్రొ : స్సరిస్సరి నువెళ్ళి పుస్తకమే పట్టుకో, చదువు మీదే ధ్యాసపెట్టుకో

శోభ : (వెళ్తూ) (గోడకున్న ఫోటోను తదేకంగా చూస్తుంది)

ప్రొ : ఏంటమ్మా అలా చూస్తున్నావు.

శోభ : నిన్నటి వరకు ఇంకో హీరో అంకుల్ ఫోటో ఉండేది కద నాన్న!

ప్రొ : నిన్నే ఆ హీరో ఫోటో తీసేసి ఈ హీరో ఫోటో పెట్టాం.

శోభ : ఏం ఆ అంకుల్ మంచోడు కాదా నాన్నా!

ప్రొ : ఇండస్ట్రీలో మంచి చెడు అని ఉండవమ్మా! లాభమా? నష్టమా అనేవి మాత్రమే ఉంటాయి.

శోభ : ఈ అంకులంటే నాకు చాలా ఇష్టం!

ప్రొ : అలా అనకూడదమ్మా! నువు నన్ను ఇష్టపడాలి. అమ్మ లేదు గానీ ఉంటే అమ్మను ఇష్టపడాలి. మావయ్యను ఇష్టపడాలి. మీ అన్నయ్యను ఇష్టపడాలి.

శోభ : అదికాదు నేను ఈ అంకుల్ ఫేన్‌ని.

ప్రొ : అయ్యయ్యో! హీరోలకి హీరోయిన్లకి ఫేన్లగా మారిపోవాల్సింది మనం కాదమ్మా! వేరే రకం మనుష్యులుంటారు. వాళ్ళు ఫేనులుగా ప్రవర్తిస్తారు. నీకేం ఖర్మ అమ్మ... నువు బుద్ధిగా చదువుకో. వెళ్ళెళ్ళు.. లోనకు పోయి చదువుకో... (అమ్మాయి లోనకు వెళ్ళిపోయింది) (రైటర్‌తో) చూసావా? ఒక సినిమా బ్యాన్ చేసినందుకు స్టూడెంట్స్ స్ట్రయిక్ చేస్తున్నారు. టైటిల్ ఎలా పెట్టారో విన్నావా? “పట్టుకో ... పెట్టుకో”

రైట : దాంట్లో అశ్లీలత ఉంది కదాండీ?

ప్రొ : ఉంటుంది. ఉండకపోతే ఎలా? రామాయణంలో రంకు లేదా! భారతంలో బూతులేదా! అలాగని వాటిని చదవడం మానేస్తున్నారా? సినిమాల దగ్గరకొచ్చేసరికి ప్రతీవాడు నీతులు చెప్పేది.

**బాలు** : దాని టైటిల్ మార్చమని సెన్సార్ వాళ్ళు అడిగితే ఆ రైటరు, డైరెక్టర్ భలే వివరణ ఇచ్చారు సార్.

ప్రొ : ఏవన్నారు!

**బాలు** : పట్టుకో – పెట్టుకో అంటే దాంట్లో బూతు చూస్తున్నారంటే మీ బుర్రలు ఎంత పాడైపోయాయో నాకర్థం కావట్లేదు. మీ లాంటి వారిని ఈ సెన్సార్ బోర్డు మెంబర్లుగా ఎలా వేశారో నాకు తెలీట్లేదని తెగ ఊదర గొట్టేశాడండీ ఆ డైరెక్టరు.

ప్రొ : ఇంతకు ఆ టైటిల్‌ని ఎలా జస్టిఫై చేశారో చెప్పు.

**బాలు** : ఏవుంది సార్! పట్టుకో అంటే నా చేయి పట్టుకో – పెట్టుకో అంటే నా జడలో పూలు పెట్టుకో అని ఓ భార్య తన భర్తను అడుగుతుంది. ఇంతకన్నా సంసార పక్షమైన ఫ్యామిలీ సబ్జెక్ట్ ఏవుందని బల్లగుద్ది రైటర్ అడిగేసరికి సెన్సార్ వాళ్ళు నోళ్ళు మూతలు పడిపోయి సర్టిఫికెట్ ఇచ్చేసారండి.

ప్రొ : ఇప్పుడు మరి ఎందుకు బ్యాన్ చేసినట్టు

**బాలు** : ఫస్ట్ హాప్ అంతా కాలేజీ బ్యాక్‌గ్రౌండ్ పెట్టారు సార్! సెకండ్ హాఫ్ మళ్ళీ ఫ్యామిలీ కథ అనుకోండి. కాలేజీ సీన్స్‌లో ఒక సీనేమిటంటే – ఒక మహిళా లెక్చరర్‌ని నలుగురు స్టూడెంట్స్ కలసి రేప్ చేసేస్తారు. అందుకు ఇటు మహిళా

సంఘాలు, అటు లెక్చరర్స్ అసోసియేషన్స్ గొడవబెడితే గవర్నమెంటు ఆ సినిమాను బ్యాన్ చేసింది.

**ప్రొ** : ఒక లేడీ లెక్చరర్‌ని, నలుగురు స్టూడెంట్స్ రేప్ చేసారా? సీన్ బాగుందే... అందులో బ్యాన్ చేయాల్సినంత తప్పేముందబ్బా!

**బాలు** : అందుకే కదా! స్టూడెంట్స్ అంత తిరగబడ్డారు.

**రైట** : తిరగబడ్డారా?

**బాలు** : మరి ఊరుకుంటారా? స్టూడెంట్స్‌ని జులాయి వెధవలుగా చూపిస్తున్నారు. వీధి రౌడీలుగా చూపిస్తున్నారు. దొంగలుగా చూపిస్తున్నారు. పిచ్చి ప్రేమికులుగా చూపిస్తున్నారు. ఇన్ని విధాలుగా పనికొచ్చిన మేము మా మేడమ్‌ని మేము రేప్ చేసుకుంటే మీ కొచ్చిన అబ్జెక్షన్ ఏంటని అడుగుతున్నారు.

**ప్రొ** : వాళ్ళన్నది కూడా పాయింటే

**రైట** : ఏవిటండీ పాయింట్! విద్యార్థులంటే ఎవరండీ! మనదేశ భవిష్యత్తండీ! జాతి పురోగతి వాళ్ళ నడవడిక మీదే ఆధారపడి ఉంటుందండీ. అలాంటి విద్యార్థులు వాళ్ళకు చదువు నేర్పిన పంతులమ్మను రేప్ చేస్తే ఆ సీను మీకు బాగుందా? వాళ్ళ అడ్డగోలు ఆర్గ్యూమెంట్ కూడా మీకు ఒక పాయింటేనా? ఇదేనా మనం సినిమాల ద్వారా ప్రజలకు తెలియచేసే సందేశం.

**ప్రొ** : అంటే సినిమాలు తీసి సందేశాలివ్వాలంటావు.

**రైట** : అవును.

**ప్రొ** : సందేశాలివ్వడానికి సినిమాలెందుకు తియ్యడం! మా సందేశం ఇదే అని అందరికీ ఉత్తరాలు వ్రాస్తే సరిపోతుందిగా.

**రైట** : పది చెత్త సినిమాలు తీసే కన్న ఒక మంచి ఉత్తరం వ్రాయడం నిజంగా గొప్పకళ.

**ప్రొ** : ఒరెయ్ బాలూ!

**బాలు** : రైటర్‌గారూ! మీరనవసరంగా ఆవేశపడుతున్నారు. మీరు సినిమాలకు పనికిరారు వెళ్ళండి.

**ప్రొ** : అతను సినిమాలకు పనికొస్తాడు.

**బాలు** : ఏంటిసార్ మీరనేది?

**ప్రొ** : ఇతనికి మంచి ఆవేశం ఉంది. ఇండస్ట్రీకి ఆ ఆవేశం కావాలి. కానీ అతని ఆలోచనలు మనం మార్చాలి.

**బాలు** : అయితే ఇప్పుడితన్ని ఏం చేయమంటారు?

**ప్రొ** : మన ఆఫీసులో కూర్చోబెట్టి సినిమా క్యాసెట్లు చూపించు. తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ అన్ని రకాల కాసెట్లు చూపించు. ఎందులో ఏది బాగుంటే దాన్ని ఎలా దొబ్బెయాలో నేర్పించు.

**బాలు** : నేర్పిస్తాను.

**ప్రొ** : మళ్ళీ అతను నాదగ్గరకు వచ్చినప్పుడు నీతులు చెప్పకూడదు. బూతులు చెప్పాలి. సూత్రాలు, సాంప్రదాయాలు గురించి మాట్లాడకూడదు. వయోలెన్స్, సెక్స్, సస్పెన్స్ గురించి మాట్లాడాలి.

**రైట** : నా ప్రాణం పోయినా.....

**బాలు** : (రైటర్ నోరు మూసి) అవన్నీ నాకు వదిలేసి మీరు నిశ్చింతగా ఉండండి.

**ప్రొ** : ఓ.కే.....

(బాలు చేతిలో రైటర్ గిలగిల కొట్టుకుంటుండగా)

॥తెర॥

## 2వ రంగం

(Lights on. లోనుండి శోభ కాలేజీకి వెళ్ళబోతోంది.)

**శోభ** : డాడీ! కాలేజీకి వెళ్తున్నాను.

**ప్రొ** : (లోనుండి) ఓకే.......ఆల్ ద బెస్ట్.... కారు తీసుకెళ్ళు.....

**శోభ** : అలాగే డాడీ!

(గది మధ్యలోకి వచ్చి గోడకున్న హీరో శివరాం ఫోటో వంక చూసింది. ఆ ఫోటోని అలాగే తదేకంగా చూసి మురిసి పోయింది. ఒక కుర్చీ ఫోటోకి దగ్గరగా లాగింది. లోనకోసారి చూసి ఎవరూ చూడటం లేదని నిర్ధారించుకున్న తర్వాత కుర్చీ ఎక్కి శివరాం ఫోటోకి గట్టిగా ముద్దు పెట్టుకుంది. కుర్చీ మీదనుండి క్రిందకు దిగబోతూ, మరోసారి ముద్దుపెట్టుకుంది. అప్పుడే లోనుండి వస్తున్న లచ్చన్న ఆ సంఘటన చూసాడు.)

**లచ్చు** : ఛీ! చీ! ఏంపనండీ అది.

**శోభ** : (ఆ మాట విని గతుక్కుమంది) లచ్చన్న ప్లీజ్ మా డాడీకి చెప్పకు.

**లచ్చు** : చెప్పకుండా ఉండలేనుగా

**శోభ** : ప్లీజ్! ప్లీజ్! ఈ విషయం చెప్పావనుకో కాలేజి మాన్పించేస్తారు.

**లచ్చు** : అప్పుడు నాకు తోడుగా వంటపని చేసుకోవచ్చు.

**శోభ** : ప్లీజ్ లచ్చన్న! ఇతనంటే నాకెంత ఇష్టమో!

**లచ్చు** : ఒట్టిమాటలతో నాదగ్గర పని జరగదు.

**శోభ** : ఎంతివ్వమంటావు చెప్పు.

**లచ్చు** : నేను చెప్పేదేవుంది. ప్రతిదానికి మీరే రేట్లు పెట్టేశారుగా! మీ డాడీకి చెప్పకుండా ఫ్రెండ్స్‌తో మీరు సినిమాకెళ్తే ఆ విషయం నేను చెప్పకుండా ఉండడానికి డబ్బులిస్తారు. ఆ సినిమా సంసారపక్షంది అయితే యాభై, కాస్త వయెలెన్స్ అయితే వంద. ఇంతకీ అతనంటే ఎంత ఇష్టం?

**శోభ** : ఎంతిష్టమంటే! అబ్బ నేను చెప్పను. నువు మా డాడికి చెప్పేస్తావు.

**లచ్చు** : నేను చెప్పనమ్మాయి గారు.

**శోభ** : ఒట్టు (చేయి చాచింది)

**లచ్చు** : ఒట్టు (చేతిలో చెయ్యి వేసాడు)

**శోభ** : ఇతని ఫోటో ఎప్పుడు పేపర్లో పడినా వెంటనే కట్ చేసి నా ఆల్బమ్‌లో దాచేసుకుంటాను తెల్సా?

**లచ్చు** : ఓస్ ఇంతేనా!

**శోభ** : ఇప్పటికి ఇతనికి వంద లెటర్స్ వ్రాసాను తెల్సా!

**లచ్చు** : ఏంటి! లవ్ లెటర్సే.

**శోభ** : ఛీ! పో! కాదు ఉత్తుత్తి లెటర్స్!

**లచ్చు** : ఇంకేం చేసారు.

**శోభ** : ఇతనితో కలిసి డాన్స్ చేస్తున్నట్టు అప్పుడప్పుడు కలలొస్తుంటాయి తెల్సా!

**లచ్చు** : అమ్మో! అయితే నీకో బ్రహ్మాండమైన న్యూస్ చెప్తాను వినండి.

**శోభ** : ఏంటది?

**లచ్చు** : ఈ రోజు....

**శోభ** : ఆ ఈ రోజు...

**లచ్చు** : హీరో శివరాంగారు....

**శోభ** : ఆఁ శివరాంగారు....

**లచ్చు** : మనింటికొస్తున్నారు

**శోభ** : రియల్లీ... ఓ లచ్చన్న యు ఆర్ గ్రేట్.... థ్యాంక్యూ లచ్చన్నా థ్యాంక్యూ... ఈ రోజు కాలేజ్ ఎగ్గొట్టి ఇంటికొచ్చేస్తాను డాడీతో నువ్వు మ్యానేజ్ చేయాలి.

**శోభ** : ఇదిగో (వందరూపాయిలిచ్చింది)
ఈ హండ్రెడ్ తీసుకో!

**లచ్చు** : హీరో మనింటికి వస్తున్న సంగతి మీ డాడీకింకా తెలీదు. నేనే ఫోను తీసాను... ఇన్ఫర్మేషన్ తొక్కేసాను.

**శోభ** : ఒ.కె. లచ్చన్న యు ఆర్ గ్రేట్. సో! నువ్వు నాకీ విషయం చెప్పినట్టు గానీ, నేను క్లాసులు ఎగ్గొట్టినట్టు గానీ అనుమానం రాదు... పదవెళ్దాం.
(ఆమె వెళ్ళిపోయింది – లచ్చన్న కూడా వెళ్ళబోతుంటే లోనుండి ప్రొడ్యూసర్ వచ్చాడు)

**ప్రొ** : ఏరా! చెత్త వెధవా! ఇంకా నువు వెళ్ళలేదా?

**లచ్చు** : వెళ్తున్నానండీ! ఆ మాత్రం దానికి తిట్టాలా!

**ప్రొ** : తొందరగా వెళ్ళు వెధవా! (బాలు వచ్చాడు) రావయ్యారా! ఎలా ఉన్నాడు రైటర్.

**బాలు** : బ్రహ్మాండంగా ఉన్నాడు సార్. మీరన్నట్టు సినిమా రంగానికి పనికి వచ్చే వజ్రంలా తయారౌతున్నాడు.

**ప్రొ** : నాకు తెల్సయ్యా! ట్యాలెంట్ ఎక్కడ ఉన్నా ఇట్టే పసిగట్టేస్తాను.

**బాలు** : క్యాసెట్ మీద క్యాసెట్టు తెగ చూసేస్తున్నాడు.

**ప్రొ** : ఏమైనా కక్కేడా!

**బాలు** : పానకాల స్వామిలాగ తాగిందంతా లోనకెళ్ళి పోతుందే గానీ ఒక్క చుక్కకూడా బయటకు రావడం లేదు.

**ప్రొ** : అదికాదయ్యా! ఏమైనా రాసాడా అని.

**బాలు** : ఇప్పుడొస్తాడుగా. ఏం రాసాడో వినిపించమందాం.

(ఫోను రింగయింది. బాలు ఫోన్ తీసాడు) హలో! ఆ సార్ నమస్కారం సార్! ప్రొడ్యూసర్‌గారు ఉన్నారు సార్! (ఫోన్ ఇస్తూ) సార్! హీరోగారు మాట్లాడుతున్నారు.

**ప్రొ** : ఆ! నమస్తేసార్! ఆ! ఏంటి ఇంటికొచ్చేస్తారా! రండిసార్ రండి! ఇందాక చేసేరా! నాకెవరూ చెప్పలేదే.... సర్లెండి సార్. వచ్చెయ్యండి (ఫోన్ పెట్టేసి) హీరోగారు మనింటికే వస్తున్నారు.

**బాలు** : నిజమా! మీరు అదృష్టవంతులు సార్!

**ప్రొ** : హీరో శివరాం మనింటికి రావడం అదృష్టమే. కానీ కథ వినిపించమంటే?

(అప్పుడే రైటర్ ఎంటరయ్యాడు)

**బాలు** : అదిగో రైటరొచ్చేసారు.

**ప్రొ** : హమ్మయ్య! బతికించావయ్యా బాబు! రా కూర్చో... కథ వినిపించు! బాలూ! ఆ ఛైర్ ఇలా వెయ్యి. రైటర్ గారు కూర్చుంటారు.

(రైటర్ బాగా తాగి ఉన్నాడు. అలాగే కుర్చీలో కూలబడ్డాడు.)

(ప్రొడ్యూసర్, బాలు ఇద్దరు ఎదురుగా కూర్చుని చాలా యాక్టీవ్‌గా ఉన్నారు.)

**రైట** : (సరిగ్గా కూర్చోలేని పరిస్థితిలో) ఏంటి కావాలి మీకు?

**ప్రొ** : కథ

**రైట** : కథా

**బాలు** : కథే

**రైట** : కదా!

**ప్రొ** : కథేనయ్యా బాబు!

**రైట** : కథ కంచికి నేను ఇంటికి (దబ్బున ముందుకి పడిపోయాడు)

**ప్రొ** : ఏంటిలా పడిపోయాడు.

**బాలు** : ఫుల్‌గా తాగినట్టున్నాడు సార్!

ప్రొ : దొంగనాయాలా! నా కొంప ముంచావు కదరా!

**బాలు** : నేనేం చేసాను సార్

ప్రొ : వీడు సినీరంగానికి పనికొచ్చే వజ్రమా!.... నిన్ను నాలుగు తంతే తప్ప నాకసి తీరదు.

**బాలు** : కొడితే కొట్టండి సార్. కానీ అతడు వజ్రమే.

ప్రొ : మళ్ళీ అదే మాట... (రైటర్ సంచిలోంచి క్రిందపడిన పేపర్లు తీసుకొని చదివాడు. బాలు కూడా తదేకంగా ఆ పేపర్లోకి చూస్తున్నాడు) ఇదేదో రాసాడయ్యా!

**బాలు** : కథసార్!

ప్రొ : (చదివి) అబ్బా! చాలా బాగా రాసాడయ్యా... అయితే ఇంకా పూర్తి కాలేదు.

**బాలు** : నేను చెప్పాను కదా సార్! పనికొస్తాడని.

ప్రొ : ఇప్పుడేం చేద్దాం మరి.

**బాలు** : ఇంకో నాలుగు రోజులు టైమిస్తే రాసేస్తాడు.

ప్రొ : చూడబోతే ఇదేదో మంచికథ అయ్యేటట్టుంది. ఓ పన్జేద్దాం.

**బాలు** : చెప్పండి సార్

ప్రొ : మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నావేకదా!

**బాలు** : అవును

ప్రొ : కథ కూడా నా పేరే వేసుకుంటాను.

**బాలు** : అప్పుడు కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం మీవి అయిపోతాయి.

ప్రొ : అవును. మరి వీడి సంగతి

**బాలు** : నేన్జూసుకుంటాను.

ప్రొ : ఇది బాగానే ఉంది. కానీ, ఇప్పుడు హీరోవస్తానన్నాడే... ఆ సంగతేం జేద్దాం

**బాలు** : దానికో ఐడియా చెప్పనా.

ప్రొ : చెప్పు

**బాలు** : హీరోయిన్‌కి స్విమ్ సూట్‌తో ఒక సీన్ పెట్టాం కదా!

ప్రొ : అవును.

**బాలు** : స్విమ్‌సూట్ కూడా మొన్నే పర్చేజ్ చేసాం

ప్రొ : దాని గొడవ ఇప్పుడెందుకయ్యా!

**బాలు** : పూర్తిగా వినండి సార్! హీరోయిన్‌కి ఫోన్ చేసి హీరోగారు స్విమ్‌సూట్ ట్రయిల్ చూద్దామంటున్నారని పిలుద్దాం. ఆమె వస్తాది. వచ్చాక ఆ సూట్ వెయ్యించి కాస్సేపు మనింట్లోనే స్విమింగ్ పూల్ దగ్గర స్పెండ్ చేయిద్దాం. ఈ లోగా అతను కాస్త కూల్ అవుతాడు. అప్పుడు చెబ్దాం!

**ప్రొ** : ఏమని?

**బాలు** : రైటర్ ఇక్కడకొస్తుంటే యాక్సిడెంట్ జరిగిందని దాంతో మరికొంత కూల్ అవుతాడు. అప్పుడు మళ్ళీ చెబ్దాం.

**ప్రొ** : ఏవనీ?

**బాలు** : రైటర్ డిశ్చార్జ్ అయ్యేసరికి ఒక వారం పడుతుందని. అప్పుడు మనకి ఓ వారం రోజులు కలిసొస్తాయి. ఈ లోగా మంచి కథ ప్రిపేర్ అయిపోతుంది. ఏవంటారు సార్!

**ప్రొ** : స్సరే కానీ! ముందు వీడ్ని లెగ్గొట్టి ముఖం కడుగు – (ఇద్దరూ బలవంతంగా లేపారు. బాలు రైటర్‌ని లోనకు తీసుకెళ్ళాడు) (బయట నుండి విలేకరి వచ్చాడు)

**విలే** : నమస్కారం సార్!

**ప్రొ** : నమస్తే! ఏంటిలా వచ్చావ్.

**విలే** : మన సినిమా గురించి కవర్ చేద్దామని.

**ప్రొ** : సినిమా అయ్యేలోపు నన్ను కవర్లోపెట్టి నమిలేసేటట్టున్నావు.

**విలే** : నాకిచ్చేదెంతసార్ సముద్రంలో ఉప్పుగడ్డ. మన సినిమా కథేంటో చెప్పండి.

**ప్రొ** : ఏంటయ్యా ఇది. ప్రతివాడు కథ కథ అని ప్రాణం తీసేస్తున్నారు. అసలు సినిమాకు కథ ఎందుకయ్యా.

**విలే** : భలేగా చెప్పారు సార్! రియల్లీ వండర్‌ఫుల్. సినిమాకు కథెందుకు? అవసరం లేదు. సార్ ఓ వెయ్యి రూపాయిలు పెట్టి ఒక కవర్ ఇవ్వండి. సినిమాకు కథ అవసరం లేదని ఒక స్టేట్‌మెంట్ మీ పేర్న వేసేస్తాను.

**ప్రొ** : నువు డబ్బులు గుంజడానికి ప్రయత్నిస్తున్నావు గానీ – నేను చెప్పింది నిజం. రాజకీయ రంగంలో రాజనీతిలేదు. న్యాయస్థానాల్లో న్యాయంలేదు. స్వపరిపాలనలో మన పాలనలేదు. మొత్తం వరల్డ్ బేంకే. ఇన్నింట్లో ఇన్ని లేంది సినిమాల్లో కథలేకపోతే తప్పేంటయ్యా.

**విలే** : సూపర్ సార్! మీరు రాజకీయంలో చేరితే డెఫినిట్‌గా మంత్రి అవుతారు.

ప్రొ : తెలివైన రాజకీయ నాయకుడు తన వృత్తిని వ్యాపారం చేసుకుంటాడు. తెలివితక్కువ వ్యాపారస్తుడు తన వృత్తిని రాజకీయం చేసుకుంటాడు.

విలే : అబ్బ ఏం చెప్పారు సార్!

ప్రొ : నువ్వు అదిరిపోయే మాట ఇంకోటి చెబుతాను విను.

విలే : చెప్పండి.

ప్రొ : ఇప్పుడు మనం తియ్యబోయే సినిమాకు కథ రాస్తున్నదెవరో తెల్సా!

విలే : బ్రదర్సా!

ప్రొ : ఊహూ

విలే : కాసానా?

ప్రొ : ఊహూ

విలే : పల్లేటా?

ప్రొ : కాదు

విలే : మీరేజెప్పండి సార్!

ప్రొ : నేనేఁ!

విలే : ఆఁ!

ప్రొ : నిజం! ఏ కథలూ నచ్చక! ఆఖరికి నేనే పెన్ను పట్టాల్సి వచ్చింది.

విలే : సార్ ఈ కవర్లో రెండు పెద్దనోట్లు పడెయ్యండి సార్.

ప్రొ : (జేబులోంచి తీస్తున్నాడు)

విలే : మీరు కథకులుగా మారిన శుభ సందర్భంలో కోటా పెంచండి సార్!

ప్రొ : ప్రెస్ అనే పేరు ఎవడు పెట్టాడోగానీ పైసలు కోసం ఎంత ప్రెస్ చేస్తారో!

విలే : అబ్బ ఎంత కవితాత్మ వ్యక్తీకరణ

ప్రొ : ఐటమ్ బాగా రావాలి.

విలే : పేపర్ రేపు చూసుకోండి! "రైటర్‌గా మారిన ప్రొడ్యూసర్ చంద్రశేఖర్" ఎలా ఉంది కాప్షన్.

ప్రొ : సూపర్!... ఇంక వెళ్ళు.

విలే : బై.... (వెళ్తున్నాడు. లోనుండి బాలు రైటర్‌ని తీసుకొస్తున్నాడు)

రైట : (వస్తూ) సార్.... (విలేకరిని చూపిస్తూ సైగ చేసాడు ప్రొడ్యూసర్. దాంతో బాలు రైటర్ నోరు నొక్కేసి ఎక్కడి వాడక్కడే ఆగిపోయాడు)

విలే : (గుమ్మం వరకు వెళ్ళిన వాడు వెనక్కి వస్తూ) సార్! మీరు కథరాయడానికి... (రైటర్‌ని చూసి)... ఇతనెవరు సార్!

ప్రొ : ఇతను....ఆ! ఎల్.ఐ.సి. ఏజంట్!

విలే : అలా నోరు నొక్కేస్తున్నారేంటి?

బాలు : ఏం లేదు... కళ్ళుతిరిగి పడిపోతే ముఖం కడిగి తీసుకొస్తున్నాను.

ప్రొ : అంతే... అంతే

విలే : మానవత్వం మూర్తీభవించిన మహాత్ములు సార్!

ప్రొ : కొంచెం ఓవర్ అయినట్టుంది.

విలే : కథరాయడానికి మీకు ప్రేరణ ఏంటి సార్!

ప్రొ : తొక్క! ముందు ఇది కవర్‌చెయ్యి. అది మరోసారి కవర్ చెయ్యొచ్చు

విలే : కరక్టే... ఇంకో కవరొస్తది... బై..... (విలేకరి వెళ్ళిపోయాడు) (బాలు, రైటర్ లోనుండి వచ్చారు)

రైట : (బాలుతో నెమ్మదిగా) నేనిక్కడకెప్పుడొచ్చాను.

బాలు : అవన్నీ తర్వాత చెబుతాను... మీ కథ ప్రొడ్యూసర్‌గారు చదివారు.

రై : (సంతోషంగా) చదివారా! ఎలా ఉంది సార్!

ప్రొ : చాలా ఛండాలంగా ఉంది..... తూ.....తూ... అదేం కథయ్యా!

రైట : సారీ సార్

ప్రొ : ఏంటి సారీ! పది రోజుల నుండి పీకల్దాక తాగి, తిని చెత్త చెత్తగా రాసావు.

రైట : నాకు మరొక్క అవకాశం ఇవ్వండి... కొత్త కథ రాస్తాను. దీన్ని చించేస్తాను లెండి. (కాగితాన్ని చింపెయ్యబోయాడు)

బాలు, ప్రొ : (ఇద్దరూ కంగారు పడ్డారు)

ప్రొ : ఆ! ఆ! అదెందుకు చింపడం

బాలు : ఏదో ఒకటి రాసారు కదా! ఉండనివ్వండి.

రైట : బాగోలేంది ఎందుకు లెండి. చింపేద్దాం.

ప్రొ : బాగులేదంటే చింపెయ్యమనికాదు. బాగుచెయ్యమని

బాలు : నిన్ను మేము బాగుచేసుకున్నాంగా – అలాగ.

ప్రొ : దాన్నే ఇంప్రూ చెయ్యండి.. వెళ్ళండి మరో పదికేసెట్లు చూసి మరో డైమన్షన్స్‌లో ఆలోచించండి.

రైట : ఈ సారి మీకు తప్పకుండా నచ్చేటట్టు రాస్తాను.

ప్రొ : వెళ్ళు... వెళ్ళు...
(రైటర్ వెళ్ళిపోయాడు)

**బాలు** : సార్! ఈ కథ బాగులేదని చెప్పి అతన్ని Discourage చేసి ఎంతో కొంత అతని చేతిలో పెట్టి దాన్ని దొబ్బేద్దాం.

ప్రొ : కథ పూర్తయ్యాక ఆ పన్చేద్దాం... అంతవరకు నువు నోర్మూసుకొని ఉండు. (బయట నుంచి లచ్చన్న హడావిడిగా వచ్చాడు)

**లచ్చ** : సార్! సార్ హీరోగారు వచ్చేశారు (మళ్ళీ బయటకెళ్ళాడు) (లచ్చన్న హీరోని తోడ్కొని వచ్చాడు) ప్రొడ్యూసర్ ముఖమంతా నవ్వుపులుముకొని ఎదురేగాడు – హీరో శివరాం చాలా హీరోయిక్‌గా ఎంటరయ్యాడు.

ప్రొ : నమస్కారం. రండి! రండి!... మా అసిస్టెంట్ డైరెక్టర్ తెల్సుకదా!

**శివ** : తెల్సు తెల్సు.... (ఆ. డై. హీరో కాళ్ళకు నమస్కరించాడు) లే...లే...

**బాలు** : మీ బ్లెస్సింగ్స్ ఉండాలి సార్!

**శివ** : తప్పకుండా! (ఒక కుర్చీలో చాలా Comfortable గా Settle అయి) కథేంటో చెప్పండి!

ప్రొ : కథ..... కథ......

**శివ** : నిజానికి మిమ్మల్ని కథ అడగకూడదు. కానేంజేస్తాం – వరసన నాలుగు ఫ్లాప్ దెబ్బలు చూసారుగా.

ప్రొ : అవున్సార్!

**శివ** : అందుకే ఈసారి కథ మీద బాగా Concentrate చేస్తున్నాను. (వెంటనే బాలు కల్పించుకుని)

**బాలు** : మాకథ చాలా టాప్‌గా వచ్చింది సార్... అయితే ప్రాబ్లమ్ ఏంటంటే రైటర్‌కి యాక్సిడెంట్ అయింది.

ప్రొ : పాపం పదిరోజుల వరకు రాలేడు. (స్విమ్ సూట్ వున్న ప్యాక్ తీసుకొని) ఇది చూసారా సార్!

**శివ** : ఏంటది?

ప్రొ : స్విమ్ సూట్!

**శివ** : ఇప్పుడెందుకిది?

**బాలు** : హీరోయిన్‌కి స్విమ్మింగ్ సీన్ పెట్టాం. ఇది ట్రైల్ చూద్దామని

ప్రొ : మీరు యస్ అంటే హీరోయిన్‌ని పిలిపిద్దాం... మా స్విమ్మింగ్ పూల్ దగ్గర కాసేపు....

**శివ** : ఒ.కే.....ఒ.కే..... హీరోయిన్‌ని పిలవండయితే. చంద్రశేఖర్ రావు గారూ! అందుకే మీ బ్యానర్ అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. (లచ్చున్న కాఫీ కప్పు తెచ్చి ఎదురుగా పెట్టాడు)

ప్రొ : థ్యాంక్యూ సార్! బాలు! క్విక్! హీరోయిన్‌తో మాట్లాడు. తీసుకోండి సార్! (శివరాం కాఫీ తీసుకున్నాడు)

**బాలు** : ఆఁ! హీరోయిన్ గారున్నారా?.... లేరా... ఎప్పుడొస్తారు? సరి సరి.... (ఫోను పెట్టేసి) సార్ ఆర్తిగారు అవుట్‌డోర్‌లో వున్నారట.

**శివ** : నలుగురైదుగురు హీరోయిన్స్‌ని పెడుతున్నాంగా! ఎవరుంటే వాళ్ళను రప్పించండి.... ట్రైల్ చూసేద్దాం.

ప్రొ : ఎవరో ఒకర్ని పట్టుకోవయ్యా!... ట్రైల్ చూసేస్తే టైం కలిసొస్తుంది. (బాలు ఫోన్‌లో ఒకరి తర్వాత ఒకర్ని కాంటాక్ట్ చేస్తున్నాడు. ప్రొడ్యూసర్ ఎందుకో లోనకెళ్ళాడు. ఇదే అదనుగా భావించి లచ్చున్న హీరోముందుకొచ్చాడు.)

**లచ్చు** : సార్!

**శివ** : ఏంటీ?

**లచ్చు** : నాదగ్గర ఒక సూపర్ కథ ఉంది సార్! స్కై లెవిల్ కథసార్

**శివ** : గుడ్!

**లచ్చు** : మీరు చెబితే మాసార్ సిన్మా తీసేస్తాడు. మీరో మాట చెప్పండి సార్!

**శివ** : నీ కథ సిన్మా తీయాలి.

**లచ్చు** : అవున్సార్! మీరే హీరోగా వేస్తే ఇంకా బాగుంటుంది సార్! (ఈ సంభాషణ వింటున్న బాలుకు గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి)

**బాలు** : నీకథ స్కై లెవిల్లోది. భూమ్మీద జనం చూడలేరుగాని, వెళ్ళి సార్‌కి కాఫీ తీసుకొనిరా!

**లచ్చు** : (స్వగతం) కుళ్ళు నా కొడుకు.. కాఫీ తెచ్చి చాలాసేపయింది. (లచ్చున్న లోనకెళ్ళాడు. బాలు మళ్ళీ ఫోను ట్రై చేస్తున్నాడు. బయట నుండి శోభ పరిగెత్తుకుంటూ వచ్చింది.)

**శోభ** : అంకుల్!

**శివ** : హలో! (చేయి ముందుకు చాచాడు షేక్‌హ్యాండ్ కోసం. కానీ అమ్మాయి ఇంకా స్పీడ్‌గా)

శోభ : అంకుల్ నేను మీ ఫ్యాన్‌ని (అని మీదపడి ముద్దులు పెట్టేస్తోంది. లోనుండి ప్రొడ్యూసర్ వస్తున్నాడు)

ప్రొ : (శోభ హీరో మీదపడి ముద్దులు పెడుతుండటం చూసి షాకయ్యాడు)

అమ్మ! అమ్మ! శోభ! (అంటూ గుండె బాదుకుంటూ శోభను దూరం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు.)

శివ : (అలా అమ్మాయిని పొదివి పట్టుకొనే) ఎవరీ అమ్మాయి.

ప్రొ : నా కూతురండీ!

శివ : అవునా! వెరీ నాటీ గర్ల్

శోభ : యు ఆర్ వెరీ స్వీట్ గయ్

ప్రొ : అమ్మా! ఏంటా పని.... ఇలారా... ఇలారా...(దూరంగా లాగాడు)

శోభ : నాన్నా! అంకుల్‌కి నేను ఫేనుని నాన్నా

ప్రొ : ముందునువు లోనకెళ్ళు! ఒరేయ్ ఒక హీరోయిన్‌ని తొందరగా ట్రైచేయిరా!

శోభ : (వెళ్ళడానికి మొరాయిస్తూ) ఆటోగ్రాఫ్ తీసుకొని వెళ్ళిపోతానాన్నా!

ప్రొ : స్సరే వేగంగా తీసుకొని తగలడు.

శోభ : అంకుల్ ఆటోగ్రాఫ్ ఇవ్వరా

శివ : ఇస్తాను రా.... (పుస్తకం కోసం చేయిచాపాడు)

శోభ : (ఆమె దగ్గర ఆటోగ్రాఫ్ తీసుకోడానికేం లేదు. అటు ఇటు చూసి రక్కున గౌను వెనుక జిప్ సర్రున లాగి వంగి వీపు చూపుతూ) ఆటోగ్రాఫ్ పెట్టండి....

శివ : (గర్వంగా ఫీలయ్యి) ఆమె వీపు మీద సంతకం చేసి, (కాస్త దగ్గరకు తీసుకొని) గుడ్ లక్! (వెంటనే హుషారుగా గెంతుకుంటూ వెళ్ళిపోయింది శోభ. అలా వెళ్తూ ఆ ప్రక్కనున్న స్విమ్ సూట్ తీసుకుని వెళ్ళిపోయింది.)

ప్రొ : సార్! మీ పద్ధతేం బాగాలేదు

శివ : ఏం!

ప్రొ : నా కూతురితో మీరలా Behave చెయ్యకుండా ఉండాల్సింది.

శివ : అంటే ఏంటి మీ ఉద్దేశ్యం!

ప్రొ : మీ ఆవిడ వీపు మీదో, చెల్లెలి వీపుమీదో ఎవరైనా ఆటోగ్రాఫ్ ఇస్తే చూస్తూ ఎంజాయ్ చేస్తారా

శివ : యు షటప్ ఇడియట్ – ఏవనుకుంటున్నావురా! నా గురించి

ప్రొ : ఒరే గిరే అనొద్దు.

**శివ** : ఒరే గిరే కాదు నీలాంటి వాడ్ని చెప్పుతీసుక్కొట్టాలి.

**ప్రొ** : (ఫిల్టు పట్టుకొని) ఏంట్రా కూశావు?

**బాలు** : సార్! ఏంటండీ మీరు చేస్తున్నది.

**ప్రొ** : అడ్డులే. హీరో అని గౌరవిస్తుంటే మంచి మర్యాద లేకుండా పోయింది.

**శివ** : ఇంటికి పిల్చి ఇంత అవమానం చేస్తావా?

**ప్రొ** : మా ఇంటికి వచ్చి నువు నన్ను అవమానించావు

**శివ** : చూస్తాను. ఇండస్ట్రీలో ఎలా ఉండగలవో చూస్తాను.

**బాలు** : సార్!

**ప్రొ** : ఏడిశావ్

**శివ** : ఎవడూ నీకు కాల్షీట్ ఇవ్వకుండా చేసి నిన్ను నిలువునా భూస్థాపితం చెయ్యకపోతే నా పేరు శివరాం కాదు.

**ప్రొ** : నిన్నెవడూ బుక్ చేసుకోకుండా చేసి నీ మార్కెట్టు పడగొట్టకపోతే నాపేరు చంద్రశేఖరే కాదు.

**శివ** : చూసుకుందామా

**ప్రొ** : చూసుకుందాం

**శోభ** : డాడీ! (లోనుండి పిల్చింది)

**బాలు** : (లోనకు చూసాడు) సార్! అమ్మాయి స్విమ్ సూట్ వేసుకొని వచ్చేస్తుందండీ

**ప్రొ** : ఆఁ! (కళ్ళు మూసుకున్నాడు) అమ్మా! వద్దు నువు బయటకు రావద్దు.

**శివ** : ఏ వస్తే ఏమౌతది? రమ్మను. పరాయి అమ్మాయిలకైతే స్విమ్ సూట్ వేసి నాతో పాటు స్విమ్మింగ్ పూల్ దగ్గర గడపడానికి పంపిస్తావు. నీ కూతురైతే మాత్రం పవిత్రంగా ఉండిపోవాలేం? దగుల్బాజీ వెధవ! (వెళ్ళిపోయాడు)

**శోభ** : డాడీ! ఈ స్విమ్‌సూట్ చాలా బాగుంది.

**ప్రొ** : అమ్మా రావద్దమ్మా! నిన్నలా చూడలేనమ్మా! ప్లీజ్ రావద్దమ్మా! నిన్ను తట్టుకోలేనమ్మా (అంటూ ఒక టవల్ తీసుకొని లోనకి పరుగెత్తాడు)

-Lights Off-

## 3వ రంగం

(లోనుండి శోభ వచ్చింది)

**శోభ** : (ఫోను రింగ్ చేసింది) హలో! హలో! హీరో శివరాంగారున్నారా! ఒక్కసారివ్వండి!.... నేను శోభ అని చెప్పండి తెలుస్తుంది.... హాలో! హౌ ఆర్ యూ! ఇంట్లోంచే మాట్లాడుతున్నాను మాడాడీయా! లోనున్నారు. ఫర్వాలేదు. నిన్న మీర్చిన క్యాసెట్ చూశాను.... ఎలా ఉందో నేనొచ్చాక చెబుతాను... ఇప్పుడు బయల్దేరుతున్నాను... మీ గెస్ట్‌హౌస్‌కే... ఓ.కే. సీ!యూ! లచ్చునా! లచ్చున్నా!

**లచ్చు** : ఏంటి అమ్మాయిగారూ!

**శోభ** : కారుపెట్టు.

**లచ్చు** : ఎక్కడికి.

**శోభ** : (వందరూపాయలు చేతిలో పెట్టి) విష్పర్ వ్యాలీలో దించు.

**లచ్చు** : అక్కడ ఎవరింటికి!

**శోభ** : గేటు దగ్గర దించెయ్ చాలు.

**లచ్చు** : (తిరిగిచ్చేసి) అడ్రస్ క్లియర్‌గా ఉండాలి.

**శోభ** : (మరో నోటుతీసి మొత్తం రెండొందలిచ్చి) హీరో శివరాం గెస్ట్‌హౌజ్ ఉందికదా అక్కడ డ్రాప్‌చెయ్.

**లచ్చు** : అమ్మో మీ నాన్నకీ విషయం తెల్సిందో నా ప్రాణాలు తీసేస్తాడు. నేను డ్రాప్ చెయ్యను.

**శోభ** : ప్లీజ్ లచ్చున్నా నాకీ సహాయం చెయ్యవా?

**లచ్చు** : ప్లీజ్! నన్నిందులో ఇరికించకండి!

**శోభ** : నువు ఇందులో ఇరుక్కొనేదేం లేదు. గెస్ట్‌హౌజ్‌లో నాతో పాటు ఎంతో మంది ఉంటారు. స్టోరీ డిస్కషన్స్ జరుగుతున్నాయి.

**లచ్చు** : ఎంతమంది ఉన్నా; ఆ శివరాం ఛాయలకు తీసుకువెళ్ళితే మీ డాడీ నన్ను ఉప్పుపాతర వేస్తాడు.

**శోభ** : అంత భయమక్కర్లేదు. శివరాం గారికి నేనంటే ఎంతిష్టమో తెల్సా? నాకు సినిమాల్లో ఛాన్సు ఇస్తామంటున్నారు. నంబర్ వన్ హీరోయిన్‌ని చేస్తామంటున్నారు.

**లచ్చు** : అవన్నీ మీ నాన్నగారి మీద కక్షతో చెబుతున్న మాటలు

**శోభ** : కాదు నామీద ప్రేమతో చెపుతున్న మాటలు.

**లచ్చు** : బాగా ముదిరిందన్నమాట.

**శోభ** : నాకు హీరోయిన్‌గా ఛాన్స్ వచ్చిందనుకో - నా కారు డ్రైవర్‌గా నిన్నే పెట్టుకుంటాను. ఇంక మా నాన్నకు నువ్వెందుకు భయపడాలి.

**లచ్చు** : సినిమాల్లో షాట్ కన్న ఫేట్ ఇంపార్టెంట్. మీ ఫేట్‌లో ఏముందో! పదండి దింపుతాను.

(వాళ్ళు అలా వెళ్ళగానే బయట నుండి బాలు, ఆగిశం నీలకంతప్ప వచ్చారు)

**బాలు** : నా మీద నమ్మకం ఉంచండి సార్!

**ఆ.నీ.** : నీ మీద నమ్మకం బోల్డుంది అప్పా! లేంది ఈ సినిమారంగం మీదే నప్పా!

**బాలు** : అదేంటి సార్ అలా అంటారు. సినిమారంగంలో అడుగుపెట్టి రాణించి కోట్లు, కోట్లు గడించిన వారున్నారు. కోట్లకు కోట్లు పెట్టి స్టూడియోలు కట్టినవారున్నారు. సినిమారంగం నుండి రాజకీయ రంగంలో అడుగుపెట్టి ఏకంగా మంత్రులైన వారున్నారు.

**ఆ.నీ** : ఉన్నారప్పా! అందుకేగా నేను నాలుగు మామిడి తోటలు, ఐదు కొబ్బరి తోటలు, ఒక పెద్ద రైస్‌మిల్లు అమ్మిడిసి హైదరాబాద్‌కి వచ్చి ఇడిస్తిని.

**బాలు** : ఎంత బంగారపు పళ్ళెమైనా గోడచేరుపు ఉండాలంటారు. అలా నాకెంత వర్తు ఉన్నా ఒక ప్రొడ్యూసర్ బ్లెస్సింగ్స్ అవసరం. అందుకే ఒక మాట పెద్దాయనకు చెప్పేద్దాం. మనం సిట్టింగ్స్‌కి వెళ్ళిపోదాం. జస్ట్ బ్లెస్సింగ్స్ అంతే.

**ఆ.నీ** : అట్లనే అప్పా! సినిమా ఎట్లుండాలో తెల్సా? మిస్సమ్మ, గుండమ్మ కథ, శంకరాభరణం ఆ లెక్కగుండాల.

**బాలు** : చూస్తావుగా ఎలా తీస్తానో. ఇతను తీసిన పది సినిమాల్లో ఆరు సినిమాలకు నేనే అసోసియేట్‌ని. షాట్ డివిజన్, సీన్ డివిజన్, స్క్రీన్‌ప్లే, టేకింగ్ మొత్తం మనదే. కష్టం నాది - కార్డు ఆయనది. అంచేత నమ్మకముంచండి. నేన్జేసి పెడతాను. చాలా ఎకనామిక్‌గా - ఓ.కే.

**ఆ.నీ** : హీరోయిన్ ఎట్లుండాలో తెల్సా - సావిత్రి లెఖ్ఖ

**బాలు** : సావిత్రా?

**ఆ.నీ** : అవును. ఆయమ్మ బంగారం కదూ! ఒంటినిండా చీరకట్టుకొని నుదుటిన ఇంత బొట్టు పెట్టుకొని స్క్రీన్ మీద కనబడుతా ఉంటే ఇలాంటి ఆడకూతురు,

చెల్లిగానో, వదినగానో, భార్యగానో నా ఇంట్లో ఉంటే బాగున్ను అని ప్రతివాడు అనుకుంటాడు.

**బాలు :** కానీ ఇప్పుడు హీరోయిన్స్ షార్ట్స్, లైట్స్ వేసుకొని తెరమీద కొస్తే జనాలు పిచ్చెక్కిపోతారు.

**ఆ.నీ :** మనం సినిమా తీసి ఆడోళ్ళని ఉత్తమ స్త్రీలుగా మార్చాలి గానీ పనికిరాని చెత్తగా తయారు చేసి ఇడుస్తామా చెప్పు.

**బాలు :** అలాగే సార్! అలాగే.

(లోనుండి చంద్రశేఖర్‌రావు వస్తున్నాడు)

**బాలు :** (హడావిడిగా లేచి).... (ఆగిశంతో) మా సారు... మాసారు....

**ఆ.నీ. :** నమస్కార మప్పా!

**బాలు :** సార్ ఇతను ఆగిశం నీలకంతప్ప అని. బళ్ళారి, తెలుగతనే. సెటిల్డ్ ఇన్ కర్ణాటక.

ప్రొ : ఆ! కూచోండి! కూచోండి! ఏవిటిలా వచ్చారు.

**ఆ.నీ :** ఏవీ లేదప్పా!

**బాలు :** నేన్జెప్తాను సార్! సినిమా తియ్యాలని వచ్చాడు. నన్ను దీవించండి సార్ (ప్రొడ్యూసర్ కాళ్ళ మీద పడ్డాడు)

ప్రొ : ఏంటిది? అతను సినిమా తియ్యాలనుకుంటే నిన్నెందుకు దీవించడం.

**ఆ.నీ :** బాలుని డైరెక్టర్‌గా పెట్టి ఇడుస్తామని అనుకుంటిని.

ప్రొ : వెరీగుడ్

**ఆ.నీ :** మంచి సినిమా తియ్యాలని హృదయంలో పుట్టింది. అన్నీ అమ్మి ఇడిసి ఒక ఐదుకోట్లు పెట్టాలనుకుంటున్నానప్పా.

**బాలు :** సార్! ఇండస్ట్రీలో నాకు తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీ మీరేసార్! నాకు కో-ఆపరేట్ చెయ్యండి సార్! నేను డైరెక్టర్‌గా ఇంట్రడ్యూస్ అయ్యేటట్టు ఎంకరేజ్ చెయ్యండి సార్! (మళ్ళీ కాళ్ళమీద పడ్డాడు) (అప్పుడే లచ్చన్న వచ్చాడు)

ప్రొ : లే...లే.... నిన్ను కాకపోతే నేనెవర్ని ఎంకరేజ్ చేస్తానయ్యా...లే....

**బాలు :** నన్ను డైరెక్టర్‌ని చేస్తున్నారు... మీ ఋణం తీర్చుకోలేనుసార్.

**లచ్చు :** అన్యాయం సార్ ఇది! నేను పది సంవత్సరాల నుండి పన్జేస్తున్నాను. అతనొచ్చి ఐదు సంవత్సరాలయ్యింది. అసిస్టెంట్‌గా జాయినయ్యినోడు. కోడైరక్టరయ్యాడు.

అసోసియేట్ అయ్యాడు, ఇప్పుడేకంగా డైరెక్టరయి పోతున్నాడు. మరి నామాటేంటి?

**బాలు** : నువుకూడా అయ్యావుగా!

**లచ్చు** : ఏంటయ్యాను. నేను ఆఫీస్‌బోయ్‌గా జాయిన్ అయ్యేసరికి కుక్ ఉండేవాడు. డ్రైవర్ ఉండేవాడు. గార్డెనర్ ఉండేవాడు. వాళ్ళందర్నీ తీసేసి ఆ పనులన్నీ ఇప్పుడు నా చేత చేయిస్తున్నారు.

ప్రొ : చెప్పుదీసి కొడతాను! ఇదిగో బాలూ! డైరెక్టర్‌గా నీ కార్డు పడుతుంది. కానీ ఒక్కషరతు...

**ఆ.నీ.** : (టెన్షన్‌గా) ఏమది....?

**బాలు** : ఏంటది?

ప్రొ : నా సినిమా అయ్యాక మీ సినిమా స్టార్ట్ చేసుకోవాలి.

**బాలు** : ఓకే. సార్... ఓకే! (మళ్ళీ కాళ్ళ మీదపడ్డాడు)

**లచ్చి** : నాసంగతేంటి?

ప్రొ : వెళ్ళి రెండు కప్పుల కాఫీ తీసుకురా! (లచ్చన్న చాలా కోపంగా లోనకు వెళ్ళాడు)

**బాలు** : సార్ ఒక్క విషయం (కాస్త ముందుకెళ్ళాడు)

ప్రొ : ఏంటి?

**బాలు** : ఇలా రండిసార్ (ఇద్దరూ కాస్త ముందుకొచ్చారు లోగొంతుతో మాట్లాడుతున్నాడు)... అందరు హీరోల్ని...అడిగాం సార్! శివరాం భయానికి ఎవరూ కాల్షీట్స్ ఇవ్వలేదు. ఇప్పుడెలా సార్!

ప్రొ : హీరో ఎవరన్నది తర్వాత చెబుతాను. ఎట్ ఎనీ కాస్ట్. మనం సినిమా చేస్తున్నాం. దట్సాల్! స్ట్రీటసీన్స్ అన్నీ రామానాయుడిగారి స్టూడియోలో చేస్తున్నాం. నువ్వెళ్ళి డేట్స్ తీసుకొని వచ్చేసెయ్!

**బాలు** : కథేంటో తెలీకుండా స్ట్రీటసీన్స్ ఏంటిసార్

ప్రొ : మొన్న చదివిన పేపర్లో స్ట్రీట్ సీన్స్ ఉన్నాయయ్యా!

**బాలు** : అలాగా.

ప్రొ : ఇలారా! (ఇంకాస్త ప్రక్కకి తీసుకెళ్ళాడు)....ఆ శివరాంగాడి ప్రాపర్టీస్ ఎక్కడెక్కడ ఉన్నాయో వాకబు చెయ్యమన్నాను. అదెంత వరకొచ్చింది.

**బాలు** : మొత్తం లిస్టు ఈ రోజు మన చేతికొస్తుంది సార్.

ప్రొ : థ్రీ డేస్ నుండి ఇదేమాట చెబుతున్నావు.

**బాలు** : వాళ్ళ మ్యానేజర్‌ని మ్యానేజ్ చేసాను. ఈ రోజు తప్పకుండా తెస్తాను.

**ప్రొ** : ఒకే. నువ్వెళ్ళి ఈ రెండు పనులు చేసుకొనిరా? ఈ లోగా నీలకంఠప్పని బడ్జెట్ మీద గైడ్ చేసిపెడతాను.

**బాలు** : థ్యాంక్యూ సర్!

(బాలు బయటకు వెళ్ళాడు. చం.శే. వెంటనే సెల్ తీసి రింగ్ చేసాడు. కనెక్టు కాలేదు. మళ్ళీ ఇంకోసారి చేసాడు. ఇప్పుడు కనెక్ట్ అయింది.)

**ప్రొ** : హలో! నేను చంద్రశేఖర్‌ని మాట్లాడుతున్నాను. ఎం.ఎల్.ఎ. గారికి ఇవ్వండి. ఆ ఏరా! సెల్ ఆఫ్‌లో పెట్టావు. స్సరేగానీ ఆ శివరాం గాడు మనకి ఏ హీరో కాల్షీట్స్ ఇవ్వకుండా చేస్తున్నాడు. అవును... మనమో వాడో తేలిపోవాలి... వాడి మీద నువు ఇన్‌కం ట్యాక్స్ రైడ్ చేయిచాలి. దెబ్బకు దెబ్బ తియ్యాల్సిందే. ఆః! ఆః! నేను ఆవేశ పడట్లేదు తమ్ముడూ! నేను చెప్పింది వినరా. నీకు జరిగిందంతా చెప్పాను. ఈ పని నువ్వు చెయ్యలేదనుకో. మా పెద్దనాన్న కొడుకువనే విషయం మర్చిపోవడం మంచిదికదా! సరే! రాత్రికి మాట్లాడుతాను.

**ఆ.నీ.** : ఏందప్పా! ఏదో టెన్షన్‌లో ఉన్నట్టున్నావు.

**ప్రొ** : టెన్షనేమీలేదు. ఇండస్ట్రీ ప్రోబ్లమ్స్. మీరూ దిగబోతున్నారు కాబట్టి మీకు చెప్పాలి.

**ప్రొ** : ఇండస్ట్రీ ఎలాంటిదంటే... సముద్రముంటది చూళ్ళే.

**ఆ.నీ** : కెరటాలు భలే ఉంటాయప్పా! వైజాగెల్లినప్పుడు చూస్తి.

**ప్రొ** : ఒడ్డునున్న మనిషిని లోపలికి లాక్కెళ్ళేవి కెరటాలే. లోనున్న వాడ్ని బయటపడేసేవి ఆ కెరటాలే. ఈ సినిమా ఇండస్ట్రీ కూడ ఎప్పుడూ అలలతో అల్లకల్లోలంగా ఉంటుంది. కెరటాల్తో నిత్యం కలకలంగా ఉంటుంది. ఏ కెరటం ఎప్పుడు ఎవడ్ని లోనకు ముంచేస్తాదో, ఎవడ్ని ఎలా ఒడ్డున పడేస్తదో చెప్పలేం. We can not imagine also

**ఆ.నీ.** : అవునా అప్పా!

**ప్రొ** : అంతేకాదు ఇప్పుడు నక్షత్రాలున్నాయి. అవి కళ్ళకు కనపడతాయి. కానీ చేతికందవు. స్సరే అందవు కదా అని వదిలేద్దామంటే అందుకు మనసొప్పదు. ఈ ఇండస్ట్రీలో డబ్బు, హోదా, అందం అన్నీ అందుబాటులోనే ఉంటాయి. కళ తెల్సినవాడు అన్నీ అనుభవించేస్తుంటాడు. అది తెలీనివాడి పని శనగలు తిని చెయ్యికడుక్కోవడమే.

**ఆ.నీ** : అంటే నేనిప్పుడు సినిమా తియ్యాలా? వద్దా?

ప్రొ : అదే చెప్తున్నాను. నిర్మాత కొత్తవాడనుకో డైరెక్టరు పాతవాడుండాలి. డైరెక్టర్ కొత్తవాడనుకో నిర్మాత పాతవాడై ఉండాలి. ఎందుకంటే వాళ్ళిద్దరిదీ భార్యాభర్తల బంధం.

ఆ.నీ : అంటే ఏమప్పా నువు చెప్పేది – భార్యాభర్తల్లో ఎవరికో ఒకరికి పెళ్ళికి ముందే అనుభవం ఉండాలంటావు.

ప్రొ : నా ఉద్దేశ్యమేమంటే, వీరిద్దరిలో ఎవరికో ఒకరికి ఇండస్ట్రీతో పరిచయం ఉండడం మంచిది.

ఆ.నీ : కరక్టు చెబితివప్పా!

ప్రొ : కొత్త కుర్రోడి చేతిలో డైరెక్షన్ బాధ్యత పెడుతున్నావు. అదీ మంచిదే.

ఆ.నీ : అన్నీ మంచివైతే చెడ్డ ఏదప్పా!

ప్రొ : చెడ్డదేమంటే ఏ అనుభవం లేకుండా కోట్లు కోట్లు పెట్టుబడి పెట్టాలనుకోవడం.

ఆ.నీ : అమ్మో! మరైతే సినిమా తియొద్దంటావా?

ప్రొ : తియ్యి. కానీ ఎవరితోనైనా పార్టనర్‌షిప్ కలుపు. మునిగినా సగమే మునుగుతావు.

ఆ.నీ : మునక తప్పదా?

ప్రొ : చెప్పాను కదా సముద్రమని. ఈత తెల్సినా ఫర్వాలేదు. షిప్‌లో ఉన్నా ఫర్వాలేదు. పార్టనర్ షిప్ ఒక షిప్ లాంటిది మరి.

ఆ.నీ : (చంద్రశేఖర్ రెండు చేతులు పట్టుకొని) నాకో ఉపకారం చెయ్యాలప్పా.

ప్రొ : ఏంటది?

ఆ.నీ : మీ సినిమాలో నాకు వాటా ఇవ్వాలి.

ప్రొ : మా సినిమాలోనా

ఆ.నీ : అవును.

ప్రొ : నా సినిమాకి బాలుని డైరెక్టర్‌గా పెట్టలేనుకదా?

ఆ.నీ : ఆయప్పను పెట్టమని ఎవరన్నారు. ఆ యప్పకి బదులు నువ్వే చేసి ఇడు డైరక్షన్.

ప్రొ : కానీ అతను ఫీలవుతాడుగదా!

ఆ.నీ : అఫీలింగ్ ఏముంది? దీనికి అసోసియేట్‌గా ఉండి ఇడుస్తామనదా?

ప్రొ : అయితే ఈ సినిమాకి మనిద్దరం కల్సి డబ్బు పెడుతున్నాం.

**ఆ.నీ** : నా వాటాకి ఎంత పెట్టాలి.

**ప్రొ** : ఫిల్మ్ కాస్ట్, షూటింగ్ ఎక్స్‌పెండీచర్, టెక్నీషియన్స్ రెమ్యునరేషన్స్ మీరిచ్చుకోండి. ఆర్టిస్టుల రెమ్యూనరేషన్, రికార్డింగ్ థియేటర్‌ల రెంట్స్, పబ్లిసిటీ ఎక్స్‌పెండీచర్ నేను పెట్టుకుంటాను.

**ఆ.నీ** : నా వాటాకి ఎంతివ్వాలో చెప్పప్పా.

**ప్రొ** : మొత్తం ఆరుకోట్ల బడ్జెట్. మూడు నీది – మూడు నాది.

**ఆ.నీ** : మూడుకోట్లే.....

**ప్రొ** : ఐదు పెట్టాలనుకున్నావు గదా!

**ఆ.నీ** : అవును

**ప్రొ** : ఇప్పుడు మూడేగా పెట్టేది. రెండు మిగులుతుంది.

**ఆ.నీ** : అవును కదా! రెండు మిగుల్తా ఉంది. నాకెంత ఉపకారం జేస్తావున్నావప్పా

**ప్రొ** : దాందేముందిలే... స్నేహితుడిగా భావించిన తర్వాత ఆ మాత్రం చెయ్యనా?

**ఆ.నీ** : నిజంగా చాలా థ్యాంక్సప్పా! నాకు రెండు మిగిలేటట్టు చేసావు... అవును హీరోని ఎవర్ని పెడతా వున్నాము.

**ప్రొ** : అదే ఆలోచిస్తా వున్నాను.

**ఆ.నీ** : పెద్ద హీరోని పెడదామప్పా

**ప్రొ** : పెద్ద హీరోని పెడితే మనబడ్జెట్‌లో సగం వాడికే పోతది. వద్దు. మనం క్రొత్త వాళ్ళతో తీద్దాం.

**ఆ.నీ** : అది కూడా మంచిదే. రామారావు లాంటి కుర్రోడ్ని, సావిత్రి లాంటి అమ్మాయిని సెలక్ట్ చెయ్యాలప్పా!

**ప్రొ** : అవే ముఖాలను ఎన్నాళ్ళని చూస్తారు. బొంబాయి పోయి పిటపిటలాడే మంచి పిల్లని సెలక్ట్ చేసుకుందాం.

**ఆ.నీ** : మరి పిల్లగాడో!

**ప్రొ** : అదే ఆలోచిస్తావున్నా! (అప్పుడే లచ్చన్న కాఫీ తెచ్చి టీపాయ్ మీద పెడుతున్నాడు) ఆఁ.... హీరో దొరికాడు.

**ఆ.నీ** : ఎవరప్పా అతను.

**ప్రొ** : (కాల్ చేసి) బాలు నువ్వెక్కడున్నావ్?... సరే నువ్వొచ్చేటప్పుడు – ప్రెస్ వాళ్ళను రమ్మన్నానని చెప్పు... నువ్వు వచ్చాక చెబుతాను. ఓ.కె. (ఫోను పెట్టేసి) మన హీరో ఈ లచ్చన్న గాడు

ఆ.నీ : (కాఫీ తాగుతూ పొలమారాడు)

లచ్చు : ఆఁ! (ఆమాట వినగానే వెనక్కి విరుచుకు పడిపోయాడు)

ఆ.నీ : ఇతన్ని హీరోగా పెడతావా?

ప్రొ : అవును

ఆ.నీ : హీరో అంటే కనీసం ముక్కు మొహమైనా తిన్నగా ఉండాలి కదప్పా

ప్రొ : అవసరం లేదు.

ఆ.నీ : ఒడ్డు పొడవు

ప్రొ : అవసరం లేదు.

ఆ.నీ : కనీసం వాయిస్సైనా బాగుండొద్దా

ప్రొ : ఎందుకు డబ్బింగ్ చెప్పిస్తాంగా

ఆ.నీ : నటనైనా తెలుసా

ప్రొ : తెలియక్కర్లేదు.

ఆ.నీ : మరెలా నటిస్తాడు.

ప్రొ : అదేమైనా బ్రహ్మవిద్యా? పది సినిమాలు చూసేసరికి అదే వచ్చేస్తాది.

ఆ.నీ : ఈ ముఖాన్ని ఎవడు చూస్తాడప్పా.

ప్రొ : చూసి తీరాలి.

ఆ.నీ : చూడరుగాక చూడరు.

ప్రొ : చూసేటట్టు చేస్తాం!

ఆ.నీ : ఎలా

ప్రొ : టివిలు వచ్చి సినిమాలు దెబ్బ తినేశాయంటారు. అది నిజం కాదు. ఛానల్స్ సినిమా రంగానికి చాలా ఉపకారం చేస్తున్నాయి.

ఆ.నీ : ముందు ఇతని సంగతి చెప్పప్పా...!

ప్రొ : అక్కడికే వస్తున్నా!

ఒక్కో టి.విలో వందేసి ప్రోగ్రామ్స్ ఉన్నాయి. ఎలాంటి ప్రోగ్రామ్స్? సూది–దారం, ఆటకావాలా? పాటకావాలా?, ఆటాడుకుందాం రా? ట్రింగ్ ట్రింగ్ నీది బొంగు – నాది రింగు, ఇలాంటి వాటిల్లో మన హీరోని వారంకో పదిసార్లు చూపించామనుకోండి! జనాలు అలవాటు పడిపోతారు. ఎంత దరిద్రం ముఖమైనా చూడగా చూడగా అదే అందంగా కనిపిస్తాది. తినగ తినగ వేము తియ్యగునుండని ఇది దృష్టిలో పెట్టుకొనే వేమన ఆ నీతి చెప్పాడు.

**ఆ.నీ** : ఏమోనప్పా! నాకైతే నమ్మబుద్ధి కావడం లేదు. ఆఫీస్ బోయ్ హీరో ఏంటి?

**ప్రొ** : అలాగంటావా? ఇప్పుడు స్టార్ హీరోస్ అయిన స్టార్లంతా అంతకుముందు ఈపనికూడా దొరకని వాళ్ళే! తెలుసా!

**ఆ.నీ** : సినిమా రంగంలో నీకు భలే అనుభవం అప్పా! (లచ్చన్న అప్పుడే లేచి తేరుకున్నాడు)

**లచ్చ** : సార్! గిల్లండి!

**ప్రొ** : గిల్లడమెందుకు ఒక్కటిస్తానుండు (ఫట్‌మని కొట్టాడు)

**లచ్చ** : అబ్బా!

**ప్రొ** : నిజమని ఇప్పుడైనా నమ్ముతావా!

**లచ్చ** : నిజం ఇంత నొప్పిగా ఉంటుందాసార్?

**ప్రొ** : రా? వచ్చి ఇలా కూర్చో.... ఎంత హాయిగా ఉంటుందో తెలుస్తుంది? (ఆ.నీ. ప్రక్కన సీటు చూపించాడు)

**లచ్చ** : వద్దుసార్.... నేనిలాగే నిలబడతాను.

**ప్రొ** : ఇప్పుడు నువు హీరోవయ్యా!.... కూర్చో.

**లచ్చ** : అహ వద్దుసార్

**ఆ.నీ** : కూర్చో అప్పా....

**లచ్చ** : ఉహూ....

**ప్రొ** : కూర్చోకపోతే తంతాను వెధవా!

**లచ్చ** : సరేసార్ (తక్కున కూర్చున్నాడు)

**ప్రొ** : (ఎదురుగా నిలబడి) వీడికేం తక్కువసార్... క్రాఫింగ్ నీట్‌గా కొట్టించి, మంచి డ్రెస్ లేసి గాగుల్స్ పెడితే ఏ హీరోకి తీసిపోడు. (లచ్చన్న జుత్తు ముందుకు సర్ది కళ్ళద్దాలు పెట్టాడు) ఓహో అదిరాడు. వెరీ గుడ్. మీరన్నట్టు రామారావులాగ ఉన్నాడు.

**ఆ.నీ** : రామారావా యిలాగ ఉండేవాడా!

**ప్రొ** : అవును. పాతాళభైరవిలో రామారావన్న మాట.

**ఆ.నీ** : నమ్మడం కష్టమే

**ప్రొ** : పోనీ రాముని తమ్ముడు లక్ష్మణుడనుకో. ఇకనుండి వీడి పేరు లచ్చన్న కాదు. లక్ష్మణ్! యస్.. లక్ష్మణ్.... నీలకంతప్ప గారు మనం కాస్త కాన్ఫిడెన్షియల్‌గా మాట్లాడుకుందాం. అవసరమైతే రాతలు కోతలు కూడా పూర్తి చేద్దాం. పదండి లోనకు.

**ఆ.నీ** : హీరో...?

**ప్రొ** : హీరో గురించి మీరేమీ వర్రీ కావద్దు... రండి చెప్తాను. (చంద్రశేఖర్ నీలకంతప్పను లోనకు తీసుకెళ్ళాడు.. లచ్చన్న అలా కళ్ళద్దాలు పెట్టుకొని సోఫాలో కూర్చున్నాడు.)

**బాలు** : (విచిత్రంగా చూసి) ఏంట్రా? ఆఫ్ట్రాల్ ఆఫీస్ బాయ్ గాడివి. కాలు మీద కాలేసుకొని సోఫామీద కూర్చున్నావ్. నీది గుండె చెరువా?

**లచ్చ** : (విజిల్ వేసాడు)

**బాలు** : ఏంటీ ఇంట్లో ఎవరూ లేరా?

**లచ్చ** : (విజిల్ వేస్తూ చూపుడు వేలితో దగ్గరకు రమ్మని పిల్చాడు)

**బాలు** : ఏంటి రీ రికార్డింగ్‌తో మరీ పిలుస్తున్నావ్. ఇప్పుడు నేను అసోసియేట్ బాలుని కాదు. డైరెక్టర్ బాలుని. ఈ ఫిల్మ్ హిట్టయ్యాక హిట్ డైరెక్టర్ బాలు. హిట్టుల మీద హిట్టులిస్తా. ఓ ఐదు సంవత్సరాలు సక్సెస్‌ఫుల్ మెగా డైరెక్టర్ నవుతా! నేనిలా ఎదిగిపోయి ఫైనల్‌గా స్టార్ డైరెక్టర్ నయిపోతా! నువ్వు. ఇక్కడే ఆఫీస్ బాయ్‌గా అఘోరించు. (లోనకెళ్ళబోయి).... స్టార్ డైరెక్టర్ బాలూ! (మళ్ళీ వెళ్ళబోతుంటే)

**లచ్చ** : ఒరేయ్ బాలు!

**బాలు** : ఏంటి నన్నా?

**లచ్చ** : నిన్నేరా!

**బాలు** : (వేళాకోళంగా) ఏంటి చెప్పండి సార్!

**లచ్చ** : కాఫీ తీసుకురా!

**బాలు** : నీయబ్బ! కాబోయే డైరెక్టర్‌ని నేను. నీకు కాఫీ తీసుకురావాలా?

**లచ్చ** : నువుగాకపోతే ప్రొడ్యూసర్‌తో తెప్పించుకుంటా

**బాలు** : ఎంత పొగర్రా నీకు నీయమ్మ (ఒక తన్ను తన్నాడు. దాంతో లచ్చన్న క్రింద పడ్డాడు)

**లచ్చ** : సార్! చూడండి సార్! వీడెలా నన్ను అవమానిస్తున్నాడో (ప్రొడ్యూసర్ బయటకు వచ్చారు)

**బాలు** : వీడు సోఫాలో దర్జాగా కూర్చున్నాడు సార్

**ప్రొ** : నేనే కూర్చోమన్నాను.

**బాలు** : కళ్ళకు మీ గాగుల్స్ కూడా పెట్టుకున్నాడు.

ప్రొ : నేనే పెట్టాను. ఆ శివరాం గాడి ప్రాపర్టీస్ లిష్టు సంగతి?

**బాలు** : ఇదిగోండి (లిష్టు ఇచ్చాడు)

(ప్రొడ్యూసర్ లిష్టు తీసుకొని జేబులో పెట్టుకున్నాడు)

**బాలు** : సార్! ప్రెస్ వాళ్ళను పిలవమన్నారు. నేను డైరెక్టర్‌ని అవుతున్న సంగతి అనౌన్స్ చేస్తారా సార్.

ప్రొ : కాదు మనక్రొత్త హీరోని వాళ్ళకు పరిచయం చేస్తాను.

**బాలు** : ఎక్కడ... ఎక్కడ సార్ మనకొత్త హీరో (లోనకు చూస్తూ)

ప్రొ : ఇదిగో... ఇతనే... ఇప్పుడు ఇతను లచ్చన్న కాదు లక్ష్మణ్ కుమార్ మన కొత్త హీరో.....

**బాలు** : సార్!

(క్రిందపడ్డాడు, గబుక్కున లక్ష్మణ్ లేచి వెళ్ళి నీళ్ళు తేబోయి ఆగిపోయాడు)

ప్రొ : నువు కూర్చో.... నేను తెస్తాను

(అక్కడున్న గ్లాసులోని నీటిని బాలు ముఖం మీద కొట్టి) బాలు!...బాలు!

**బాలు** : (లేచి) ఇది నిజమా? కలా?

ప్రొ : నిజమే!

**బాలు** : ఈ దరిద్రపు మొహం హీరో ఏంటి సార్

ప్రొ : వాడి మొహమే దరిద్రం కాదు. కళ్ళు ఛీ! ఛండాలం! పళ్ళు థూ! అసహ్యం చేతులు చీపురు పుల్లల్లా ఉంటాయి. కాళ్ళు తోటకూర కాడల్లా ఉంటాయి. మొత్తమ్మీద వాడి ఆకారమే పరమ వికారం. వాడిని చూస్తే ఎవడికైనా వాంతి అవుతాది. వాడిని మనిషి అనేకన్నా ఎలక్కి మనిషి ముఖం కాళ్ళు చేతులు తగిలించినట్టుంటాడు. అలాంటివాడ్ని హీరోగా చేసి సినిమాతీస్తే ఆ శివరాం గాడిని చెప్పుతో కొట్టినట్టవుతుంది. అర్థమైందా?

**బాలు** : నా డైరెక్షన్ సంగతేం చేస్తారు.

ప్రొ : తర్వాత చెప్తాను నువు లోనకు పద. (లక్ష్మణ్‌తో) ఇప్పుడు ప్రెస్‌వాళ్ళు వస్తారు. డిగ్నిఫైడ్‌గా ఉండు. ఒక హీరోలా బిహేవ్ చెయ్యి. ఎవరొచ్చినా లేచి ఎదురెళ్ళి చీప్‌గా ప్రవర్తించవద్దు.

**లచ్చ** : ఊహూ.... (ఇద్దరూ లోనకు వెళ్ళారు. లచ్చన్న అలా బిగుసుకు పోయి కూర్చున్నాడు. బయట నుండి శోభ వచ్చింది)

**శోభ** : (వింతగా చూసింది) ఏయ్ లచ్చన్నా

**లచ్చు** : నా పేరిప్పుడు లచ్చన్న కాదు. లక్ష్మణ్ కుమార్!

**శోభ** : (కనుబొమలెగరేస్తూ) ఏంటి సంగతి?

**లచ్చు** : నువ్వే చెప్పు

**శోభ** : నా ఎదురుగా కుర్చీలో ఎలా కూర్చోగలిగావురా!

**లచ్చు** : ఇప్పుడు పరిస్థితి మారిపోయిందిగా

**శోభ** : (స్వగతం) పరిస్థితి మారిపోయిందటాడేమిటి?....... గెస్ట్‌హౌస్‌లో నేను శివరాం ఇద్దరమే స్పెన్డ్ చేసిన సంగతి కనిపెట్టేసాడన్నమాట. వీడిని ఎలాగైనా మంచి చేసుకోవాలి. (లక్ష్మణ్‌తో) అదీ...... ఏవైందంటే... మేం ఇద్దరం ప్రేమించుకుంటున్నాం. నన్ను పెళ్ళి కూడా చేసుకుంటానంటున్నాడు. నేనంటే అంత ప్రేమన్న మాట. అందుకే అప్పుడప్పుడు గెస్ట్‌హౌస్‌లో కలుసుకుంటున్నాం నీ దగ్గర దాచడమెందుకని నిజం చెప్పేశాను. ఇకనుండి నువ్వే నన్ను తీసుకెళ్ళి తీసుకొస్తే ట్రిప్‌కి వెయ్యిరూపాయిలిస్తా.

**లచ్చు** : అలాగే! (హీరోనని గుర్తుకొచ్చి) అంత తొందరగా సీక్రెట్స్ అన్నీ చెప్పేశారంటే?

**శోభ** : నీకు తెల్సిపోయిందేమోనని.

**లచ్చు** : ఉహూ....!

**శోభ** : (ఫట్‌నకొట్టి) ఆ విషయం ఇప్పుడా చెబుతావు.

**లచ్చు** : అయితే కొడతావా!

**శోభ** : గట్టిగా మాట్లాడితే తంతాను కూడా

**లచ్చు** : సార్ ! (గట్టిగా పిలిచాడు)

**ప్రొ** : (బయటకొచ్చి) ఏంటయ్యా!

**లచ్చు** : నేను హీరోనయ్యానని ముందు మనింట్లో వాళ్ళకి చెప్పండి సార్

**ప్రొ** : అమ్మా! మన కొత్త పిక్చర్లో లచ్చన్నే హీరో! కాదు! లక్ష్మణ్ కుమారే హీరో.

**శోభ** : రియల్లీ... (పడిపడి నవ్వుతోంది)

**ప్రొ** : ఏంటమ్మా ఎందుకలా నవ్వుతున్నావ్.

**శోభ** : లచ్చన్న హీరో ఏంటీ డాడీ!

**ప్రొ** : అదేనమ్మా యమలీలలో అలీలాగ!

**ఆ.నీ** : (లోనుండి) చంద్రశేఖరప్పా!

**ప్రొ** : ఆ వస్తున్నా! (లోనకు వెళ్ళాడు) లక్ష్మణ్‌ని Congratulate చెయ్యమ్మా!

శోభ : కంగ్రాట్యులేషన్స్! నా విషయం మా నాన్నతో చెప్పావో చీరేస్తాను జాగ్రత్త! (లోనకు వెళ్ళింది)

లచ్చి : ఇప్పుడేం చెయ్యడం! సినిమాలో, షికార్ల వరకు ఫర్వాలేదుగానీ, ఏకంగా గెస్ట్‌హౌజ్‌లో కాపురం పెట్టేస్తానంటోంది. చెప్పకపోతే ముసలాయనకు ద్రోహం చేసినట్టవుతుంది. చెబితే చీరేస్తానంటోంది. ఆఁ! హీరోనైపోయాను కదా ఇదేం చేస్తుంది? బోడి! ముసలాడితో మంచిగుండటమే మనకు మంచిది. (లోనుండి ప్రొడ్యూసర్, ఆ॥నీ॥ ఇద్దరూ చెక్కుతీసుకొని వచ్చారు)

ప్రొ : మీ చేతుల్తో మీరే ఇవ్వండి!

ఆ॥నీ : ఇదిగో లక్ష్మణప్పా! నీకు అడ్వాన్స్! పదివేల చెక్కు.

ప్రొ : తీసుకో

లచ్చు : (చేతులు వణుకుతున్నాయి). సార్.

ఆ.నీ : తీసుకోప్పా!

లచ్చు : థ్యాంక్యూసార్! (తీసుకున్నాడు – కాళ్ళకు మొక్కబోయి హీరోనని గుర్తుకొచ్చి స్టైల్‌గా) థ్యాంక్యూ!

ఆ.నీ : మరినాకు శెలవిప్పించండి!

ప్రొ : వెళ్ళిరండి!

బాలు : (కాసింత ఆశతో) ఈ సినిమాకు డైరెక్టర్....

ఆ॥నీ : మా చంద్రశేఖరప్పే

బాలు : మరి నా సంగతి

ఆ.నీ : నెక్ట్స్ సినిమాకు నువ్వే డైరెక్టర్‌వి

ఆ.నీ : వస్తానప్పా! (వెళ్ళిపోయాడు)

లక్ష్మ : సార్! (కాళ్ళమీదపడ్డాడు)

ప్రొ : ఎన్నిసార్లు మొక్కతావయ్యా బాబూ!

లక్ష్మ : ఇప్పుడు మొక్కింది మీరు నాకు చేస్తున్న ఉపకారం గురించి కాదు.

ప్రొ : మరి

లక్ష్మ : నేను మీకు చేసిన అపకారం గురించి

ప్రొ : నువ్వు నాకు అపకారం చెయ్యడమేంటయ్యా!

లక్ష్మ : అవున్సార్ (చెవిలో గుసగుసలాడాడు. అంతే చంద్రశేఖరం ఉగ్రరూపం దాల్చాడు)

ప్రొ : శోభా!

శోభ : ఏంటి నాన్నా!

ప్రొ : ఎంతకు తెగించావే!

శోభ : (లచ్చన్నతో) అంతా చెప్పేశావా?

లచ్చ : (అవునన్నట్టు తలూపాడు)

శోభ : యూ! రాస్కెల్ (లచ్చన్న మీద పడి కొట్టబోయింది)

ప్రొ : ఆగు! వాడు చెప్పింది నిజమా! అబద్ధమా!

శోభ : నిజమే!

ప్రొ : ఎంత ధైర్యంగా చెబుతున్నావే!

శోభ : ఇందులో భయపడాల్సిందేముంది!

ప్రొ : అంటే

శోభ : ఆడైనా మగైనా ఆపోజిట్ సెక్స్ మీదకు మనసు మళ్ళడం సహజం! నా విషయంలో కూడా అదే జరిగింది.

బాలు : సార్ మనం తీసిన 'తొక్కలో ప్రేమ' సినిమాలో హీరోయిన్ తండ్రితో ఇలాగే అంటుంది.

ప్రొ : నిన్ను ఎంతో క్రమశిక్షణతో పెంచానుకదే! చక్కగా చదువుకోకుండా నీకిదేం పోయేకాలమే!

శోభ : ఎప్పుడూ చదువుకొంటూ కూర్చుంటే లైఫ్ ఎప్పుడు ఎంజాయ్ చేస్తాం.

బాలు : ఇది 'ఎంజాయ్' అనే సినిమాలో డైలాగ్ సార్!

ప్రొ : అందుకని ఇంతకు బరితెగిస్తావా!

శోభ : నేనేం భరితెగించలేదు. ప్రేమలో పడ్డాను దట్సాల్.

బాలు : అబ్బా ఇది మనం తీసిన 'నన్నెవరైనా ప్రేమించండి' సినిమాలో డైలాగ్ సార్!

(ఫట్మనికొట్టి బాలుని) నువ్వు నోర్ముయ్!......

ప్రొ : ఏంటే మాటకుమాట ఎదురు చెబుతున్నావ్!

శోభ : మీరు సినిమాల్లో చెప్పేది అదేగా! పెద్దల్ని ఎదురించండి! ప్రేమించండి! పెళ్ళిచేసుకోండి అనేగా!

ప్రొ : నువ్వింకా చిన్న పిల్లవే!

శోభ : ఒక సినిమాలో నాకన్నా చిన్న పిల్లలు ప్రేమించుకున్నట్టు చూపించారుగా!

ప్రొ : ఆ శివరాంగాడికి పెళ్ళయింది.

**శోభ** : పెళ్ళయిన వాడ్ని ప్రేమించకూడదనే రూలేమైనా ఉందా? ఆ శివరాం నన్ను పెద్ద హీరోయిన్‌ని చేస్తానని మాటిచ్చారు. కమిటైపోయాను.

ప్రొ : యూ బిచ్! (కొట్టబోయాడు)

**శోభ** : ఆగండి! (మధ్యలోనే ఆపి) నన్ను కొట్టే హక్కు మీకెవరిచ్చారు! (చేతిని విదిలించింది)... మీ హద్దులో ఉండి మర్యాద కాపాడుకోండి (సర్రున లోనకెళ్ళిపోయింది.) (ప్రొడ్యూసర్ బిక్కచచ్చిపోయి – సోఫాలో ఒరిగిపోయాడు)

**లచ్చు** : సార్! సార్....

ప్రొ : మంచినీళ్ళు... మంచినీళ్ళు...... (లచ్చన్న నీళ్ళకోసం లోనకెళ్ళాడు)

**బాలు** : దేవుడున్నాడు... మంచి గుణపాఠం నేర్పించాడు. నన్ను డైరెక్టర్‌ని చేస్తానని మాటిచ్చి, నేను తెచ్చుకున్న ప్రొడ్యూసర్‌ని పార్టనర్‌ని చేసుకుంటావా! అనుభవించు నా కొడకా! నాకు అవకాశం రానీ అప్పుడు Tit for Tat చేసి చూపిస్తాను..... మంచినీళ్ళు త్వరగా తీసుకురా.... (లచ్చన్న మంచినీళ్ళతో వచ్చాడు) ముఖం మీద నీళ్ళు చల్లి – నీళ్ళు పడుతున్నాడు – లో నుండి సూట్కేస్‌తో శోభ వచ్చింది)

**బాలు** : ఏంటి, "పడుకుందాం పద!" సినిమాలో లాగా వెళ్ళిపోతుందా కొంపదీసి

**లచ్చు** : అమ్మా! డాడీకి స్పృహ తప్పిపోయింది.

**శోభ** : ప్రాణంపోతే రాదు గానీ... స్పృహ పోతే మళ్ళీ వస్తుందిలే.

**లచ్చు** : ఏంటమ్మా అలా మాట్లాడుతారు.

**శోభ** : నేనిలాగే మాట్లాడుతాను. పరమ దుర్మార్గుడినైనా గౌరవిస్తాను కానీ ద్వంద నీతి ఉన్న వాడ్ని ఎప్పటికీ గౌరవించను.... శివరాం దగ్గరకు వెళ్ళిపోతున్నాను. డేట్ ఫిక్స్ అయ్యాక చెబుతాను పెళ్ళికి రండి! కూతురి పెళ్ళి చూసాననే తృప్తి అయినా మిగులుతుంది. (వెళ్ళిపోయింది.)

Lights Off

## 4వ రంగం

(చంద్రశేఖర్ రావు ఇల్లు స్థబ్దుగా ఉంది. బయటనుండి బాలు వచ్చాడు. లోనకెళ్ళ బోతుండగా సెల్ మ్రోగింది. అటు ఇటు కంగారుగా చూస్తూ సెల్‌లో మాట్లాడుతున్నాడు.)

**బాలు :** సార్! నమస్తేసార్! నేను తప్పకుండా మీరు చెప్పినట్టే చేస్తాను. సార్ ఇండస్ట్రీలో శివరాం అంటే ఎలాంటి పేరుండేది సార్! మీ పేరు చెప్పుకొని ఎంత మంది అన్నం తింటున్నారో నాకు తెలుసు సార్! అలాంటిది మీరు ఇంత అన్ పాపులర్ ఎలా అయ్యారు సార్! ఎవరి వలన అయ్యారు సార్. ప్రెస్‌లో, మీడియాలో మీ మీద ఇంత దుష్ప్రచారం ఎలా జరుగుతుందిసార్! ఆఖరికి మీ మీద ఇన్‌కం ట్యాక్స్ రైడ్ కూడా చెయ్యించాడు సార్. లోకమంతా ఏవైనా అనుకోనివ్వండి సార్ జరిగిన ప్రతిదానికీ నే సాక్ష్యంసార్! అరె ఆ అమ్మాయి తండ్రిని కాదనుకొని మీ దగ్గరకుకొచ్చేస్తే – మీరేదో మాయజేసి తీసుకుపోయాడని కూస్తడేంటి సార్ నాకర్థం కాదు. సార్! పగ ఎవడ్ని బాగు చెయ్యదుసార్! ఓ ప్రక్క కూతురు ఇల్లొదిలి వెళ్ళిపోయిందని కుమిలిపోతున్నాడు – మరో ప్రక్క ఆ లచ్చన్న గాడ్ని హీరోగా పెట్టి సిన్మా తియ్యాలని తెగ ఇదైపోతున్నాడు. ఇదంతా ఎందుకో మీకు మాత్రం అర్థం కాదా....... ఆc! అదీ... సార్ అప్పటికీ నేన్జెప్పాను. ఆలీ లాంటోళ్ళు ఎంత మంది హీరోలైనా చిరంజీవికున్న ఇమేజ్ పోదని వింటేనే!... సార్! ఇక్కడి విషయాలు ఎప్పటి కప్పుడు జరుగుతున్నది జరుగుతుండగానే లైవ్ ఇస్తాను సార్! ఈ విషయంలో టి.వి.9. లాగ పన్జేస్తాను. శోభ గురించి అడిగితే నేన్జూసుకుంటాను. నాకొదిలేయండి సార్! విలేకరుల్ని పిల్చి మీరు చెప్పాలనుకున్నది చెప్పేయండి సార్! .... అంతే... అంతేసార్... అంతా కుదుట పడ్డాక నా విషయం కాస్తా గుర్తుపెట్టుకోండి సార్!... థ్యాంక్యూ సార్... ఉంటానుమరి. (ఫోన్ రింగయ్యింది) (ఫోన్‌లో)... హలో! ఆ!c ఆc!! ముందు హీరోయిన్‌తో సోలో సాంగ్ తీసెయ్యండి... మేము రేపు బయల్దేరుతున్నాం. (లో నుండి చంద్రశేఖరరావు వచ్చాడు)

**చంద్ర :** ఎవర్రా!

**బాలు :** మన ఔట్‌డోర్ యూనిట్‌వాళ్ళు.... మాట్లాడతారట!

**చంద్ర :** హలో! ఆc! నమస్కారం! ఆc! ఆc! ఫైట్స్ కూడా అక్కడే చేసేద్దాం. ఆపాట తీసేయ్యండి. రేపు బయల్దేరుతున్నాం. ఉంటాను మరి.

**చంద్ర :** బాలూ! అమ్మాయి ఎలా ఉందిరా!

**బాలు :** బ్రహ్మాండంగా ఉందిసార్!

**చంద్ర :** ఒట్టు! (తలమీద చెయ్యి పెట్టుకున్నాడు)

**బాలు :** ఒట్టుసార్!

**చంద్ర :** ఇంట్లోవాళ్ళు బాగా చూస్తున్నారట్రా!

**బాలు :** పూలలో పెట్టి చూచుకుంటున్నారు సార్!

**చంద్ర :** నిజంగానా!

**బాలు :** మీతో అబద్ధంచెబుతానా సార్! పైగా శివరాం భార్యకు పిల్లలు పుట్టరని తేలిపోవడంతో ఇక చూస్కోండి ఇంట్లోవాళ్ళంతా వాళ్ళ వంశాన్ని నిలబెట్టేది మన అమ్మాయేనని తెగ మురిసి పోతున్నారు.

**చంద్ర :** పెళ్ళి ఎప్పుడు చేసుకుంటాడట.

**బాలు :** అలా మూఢం వెళ్ళిపోతే ఇలా ముహూర్తం పెట్టుకోవడమే.

**చంద్ర :** రెండో భార్య కదా! సుఖపడుతుందంటావా?

**బాలు :** అన్నీ తెలిసి అడిగితే నేనేం చెప్పగల్ను చెప్పండి. ఇండస్ట్రీలో ఎంతమంది హీరోయిన్లు మొదటి పెళ్ళాముంటుండగా రెండో పెళ్ళి చేసుకోలేదు. విజయ నిర్మల, జయప్రద, శ్రీదేవి, వీళ్ళంతా సుఖంగా లేరా చెప్పండి.

**చంద్ర :** నిజమే అనుకో!

**బాలు :** ఎంత మంది హీరోలకు ఇద్దరు పెళ్ళాలు లేరు చెప్పండి. పైగా హిట్ అయిన సిన్మాలన్నీ ఒక హీరో ఇద్దరు హీరోయిన్ల కథలేకదా! సినిమాలో హిట్టయిన ఫార్ములా లైఫ్‌లో ఎందుకు ఫెయిల్ అవుతుంది!

**చంద్ర :** బాలూ! అమ్మాయినొక్కసారి చూడాలని ఉందిరా!

**బాలు :** ఇలాగే అమ్మాయిగారి చేతులు పట్టుకొని బ్రతిమలాడాను సార్! డాడీతో ఒక్కసారి మాట్లాడమ్మా అని.

**చంద్ర :** ఏమందీ!

**బాలు :** ఆయన నా ప్రేమను అవమానించారు. పెళ్ళయ్యే వరకు డాడీ ముఖం కూడా చూడనని తెగేసి చెప్పేసింది సార్.... పాపం చిన్న పిల్ల.

**చంద్ర :** నిజమే చిన్నపిల్ల అనవసరంగా నేనే లేనిపోని రాద్ధాంతం చేసాను. అమ్మాయి ఆనందంగా ఉందికదా!

**బాలు** : బ్రహ్మాండంగా ఉంది. మీరు షూటింగ్ స్పాట్‌కి బయల్దేరండి సార్! కొంత చేంజ్ ఉంటుంది. (ఫోను వచ్చింది. బాలు తీసుకున్నాడు)

**బాలు** : హలో! ఆఁ! నమస్తే అండీ (చంద్రశేఖర రావుతో) విలేకరి నర్సింహం అండీ!

**చంద్ర** : ఆ నర్సింహం నమస్తే!... కంగ్రాట్యులేషన్సా ఎందుకు? అవునా? ఏ శుభవార్త తెల్సినా వెంటనే వచ్చి చెప్పాలి.... (ఫోను పెట్టేసి) బాలూ! హీరో శివరాం ప్రెస్ మీట్ పెట్టాడట.... ఏదో ముఖ్యమైన విషయం ఎనౌన్స్ చేస్తానన్నాడట... ఏమై ఉంటుందంటావు?

**బాలు** : ఇంకేముంటుంది సార్! పెళ్ళి గురించే అయ్యింటుంది.

**చంద్ర** : అంతేనంటావా?

**బాలు** : ముమ్మాటికీ అదే అయ్యింటుంది.... ఇప్పుడైనా కాస్త హ్యాపీగా ఉండండి సార్..

(బయట నుండి ఆగిశం, లచ్చన్న, రైటర్ వచ్చారు.)

**ఆ.నీ.** : ఏమప్పా! విన్నావా రైటర్ కథ ఎలా మారుస్తున్నాడో

**చంద్ర** : ఏమైంది నీలకంఠప్పా.

**రై** : నేను చెప్తాను వినండి సార్. మన పాతకథలో హీరో ఆజానుబాహుడు. ఆరడుగుల అందగాడు. ఇప్పుడు హీరో మారాడు కాబట్టి ఈ ఫేసుకు తగినట్టుగా కథ మార్చుకోవాలి గదా!

**చంద్ర** : అవును గదా!

**ఆ.నీ** : నువ్వు కూడా అవునంటావేమప్పా! అతను చెప్తున్న కథ కనుక మనం సినిమా తీస్తే దాన్ని చూడ్డానికి ఎవడూ రాడప్పా.

**రై** : రాకపోతే మానెయ్యనీ.

**ఆ.నీ.** : ఎవడూ రాకపోతే సినిమా తీసి నువ్వూ నేనూ చూసుకుంటామా?

**రై** : సార్. ఒక పక్క సాంగ్స్ షూటింగ్ మొదలు పెట్టాం, ఆడియో రిలీజ్‌కు డేట్ కూడా ఫిక్స్ చేశాం. ఈయనేమో ప్రతిదానికి అడ్డం పెట్టి కథ తేలనివ్వట్లేదు. తర్వాత ఏదైనా లేటయితే మాత్రం నా పూచీ లేదు.

**ఆ.నీ** : నా మీద నింద వేస్తున్నావు గదా. చంద్రశేఖరప్పా! నువ్విలా కూర్చో. హీరోగారూ! మీరలా కూర్చోండి. బాలప్పా! నువ్వు కూడా విను! ఇప్పుడు చెప్పవయ్యా కథ. అది మీకు నచ్చిందనుకో ఇక నేను నోరెత్తను. (నలుగురూ కూర్చున్నారు. రైటర్ కథ ప్రారంభించాడు).

**చంద్ర** : బాలూ! దాహంగా ఉంది. గ్లాసుడు మంచి నీళ్ళు తేరా!

**ఆ.నీ** : అందరూ కథ వినండప్పా. నువ్ చెప్పప్పా.

**రై** : పాత కథలో హీరో తనకు ఉద్యోగమిచ్చిన కంపెనీ యజమాని చనిపోతే అతని కుటుంబాన్ని ఆదుకుంటాడు. యజమాని భార్యకు కన్న కొడుకై అండగా నిలుస్తాడు. వాళ్ళ పిల్లలకు మంచి చదువులు చెప్పిస్తాడు.

**బాలు** : ఈ మొహానికి ఆ కథ పనికిరాదుగా!

**రై** : అందుకే మార్చాను. (జేబులోంచి సీసా తీసి గుక్కెడు మందేసుకొని) ఇంటి యజమాని చనిపోతే, ఆ ఇంటికి చెప్పలేనంత ద్రోహం చేస్తాడు.

**బాలు** : ద్రోహబుద్ధి ఒరిజినల్‌గా ఉన్నదే.

**రై** : ఆ యజమాని ఇంట్లోని నగా నట్రొనొక్కేస్తాడు. డబ్బుని కాజేస్తాడు. పైగా చంటి పిల్లల్ని ఒక దొంగల ముఠాకి అమ్మేయబోతాడు.

**బాలు** : అబ్బా కథ చాలా బాగా వచ్చింది. పైగా ఈ లక్షణాలన్నీ మన హీరో లక్ష్మణ్ కుమార్ ఫేస్‌లో కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ఎక్స్‌ప్రెషన్స్ కూడా చాలా ఈజీగా పలుకుతాయి.

**ఆ.నీ** : ఇదే నాకు నచ్చనిది. ఇవన్నీ విలన్ బుద్ధులు గదప్పా!

**ప్రొ** : నీలకంఠప్పగారూ! ఇంక మీరెక్కడో పూర్వకాలంలో ఉన్నారు. అప్పుడు హీరోలు, విలన్‌లు వేర్వేరుగా ఉండేవారు. ఇప్పుడు ఇద్దరికీ తేడా లేదు. (బాలు లేచి లోనకెళ్ళాడు)

**రైటర్** : అంతేకాదు. హీరోయిన్‌కీ వాంప్‌కు కూడా తేడా లేదండీ!

**ఆ.నీ** : లేదప్పా! మంచికీ చెడ్డకీ తేడా మల్లెపూవులెక్క తెల్లగా తేటగా వుండాలి.

**ప్రొ** : లోకమలా లేదు నీలకంఠప్పా!

**ఆ.నీ** : ఎందుకు లేదు. మనుష్యుల్ని చూస్తే ఇట్టే చెప్పొచ్చు. ఎవరు మంచో! ఎవరు చెడ్డో!

(బయటినుంచి చంద్రశేఖరంగారూ! చంద్రశేఖరంగారూ! పిలుపు వినబడింది)

**చంద్ర** : లచ్చన్నా అది ఎవరో చూడు! (లచ్చన్న బయటికెళ్ళాడు. లోనుండి బాలు గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చాడు.)

**బాలు** : ఇవిగోండి మంచినీళ్ళు

**చంద్ర** : ఇప్పుడేకదయ్యా తాగాను. మళ్ళీ తెచ్చావేంటి?

**బాలు** : మీరెప్పుడు తాగారుసార్.

**ఆ.నీ** : నీళ్ళు కావాలని అడిగావప్పా! నీకెవరూ తెచ్చివ్వలా!

**బాలు** : తాగండి సార్!

**చంద్ర** : తాగానంటే మళ్ళీ ఇస్తావేంటి. నీకేమన్నా పిచ్చిపట్టిందా! (గ్లాసు తీసుకొని నేలకు విసిరి కొట్టాడు. ముగ్గురూ ఒకరి మొహాలు ఒకరి నొకరు చూసుకున్నారు. బయటి నుండి లచ్చన్న విలేకరిని తీసుకుని వచ్చాడు)

**లచ్చు** : సార్! విలేకరి నరసింహం వచ్చాడు.

**చంద్ర** : రా! నరసింహం! రా! వెళ్ళావా. శివరాం దగ్గరకు వెళ్ళావా. ప్రెస్ కాన్ఫరెన్స్ జరిగిందా. శివరాం ఏం చెప్పాడు? వాళ్ళ పెళ్ళిగురించి ఏమైనా చెప్పాడా?

**విలే** : సార్! మీకు ఎలా చెప్పాలో అర్థం కావట్లేదు.

**చంద్ర** : నీ నాన్పుడంతా డబ్బుకోసమే కదా! ఇదిగో! ఈ డబ్బు తీసుకో! ఇదంతా కవర్‌లో పెట్టిస్తున్నాను. చెప్పు. శివరాం అమ్మాయిని చేసుకుంటానన్నాడు కదూ!

**విలే** : లేదుసార్!

**చంద్ర** : లేదా? మరేం చెప్పాడు. పోనీ ఆ ప్రెస్ కాన్ఫరెన్సుకి మా అమ్మాయి కూడా వచ్చిందా? అక్కడ మా అమ్మాయిని చూశావా?

**విలే** : అసలు మీ అమ్మాయికి తనకూ ఏ సంబంధం లేదన్నాడు. అదెక్కడకు పోయిందో ఎవడితో లేచిపోయిందో తనకేమీ తెలియదన్నాడు. విలేకర్లనందరినీ పిలిచి తన ఇల్లు, గెస్ట్‌హౌస్ ప్రతి అంగుళం వెతుక్కోమన్నాడు. మేం అంతా వెతికాం. మీ అమ్మాయి అక్కడెక్కడా లేదుసార్.

**చంద్ర** : ఒరేయ్ బాలు! మా అమ్మాయి క్షేమంగా వాళ్ళింట్లో ఉందన్నావు కదరా!

**ఆ.నీ** : ఏమప్పా! అమ్మాయెక్కడున్నట్టు?

**చంద్ర** : నీలకంఠప్పగారూ! మా అమ్మాయిని రేపోమాపో శివరాం పెళ్ళి చేసుకుంటున్నట్టు కూడా చెప్పాడండి వీడు.

**లచ్చు** : వీళ్ళంతా కలసి అమ్మాయిగారిని ఏదో చేసుంటారు సార్!

**చంద్ర** : ఒరేయ్! చెప్పరా! అమ్మాయి ఏమైందో!

**బాలు** : అదీ....అదీ..... (తప్పించుకోవాలని చూస్తాడు)

**విలే** : నాలుగు తంతే వాడే చెబుతాడు. పట్టుకోండి వాడ్ని (చంద్రశేఖరం కుర్చీలో కూలబడ్డాడు. మిగిలినవారు బాలును వెంబడించగా బాలు తప్పించుకుని వెళ్ళిపోయాడు వాడ్ని పట్టుకోవడానికి అందరూ బయటకు పరిగెత్తారు.

(చంద్రశేఖరం ఒక్కడే కుర్చీలో కూలబడి ఉన్నాడు. కాసేపటికి ఫోన్ రింగయింది. నెమ్మదిగా లేచి ఫోన్ తీశాడు చంద్రశేఖరం.)

**చంద్ర :** (ఫోన్‌లో) హలో!... అమ్మా! శోభా! నేను మీ నాన్నను మాట్లాడుతున్నానమ్మా! ఎలా ఉన్నావమ్మా! నీ ఆరోగ్యం ఎలా ఉందమ్మా! కోపమా అమ్మా! నీ మీదా! లేదమ్మా. అప్పుడు ఉండేది. ఇప్పుడు లేదు. పూర్తిగా పోయిందమ్మా! ఇప్పుడు నువు ఆ శివరాంని పెళ్ళి చేసుకుంటే – నేను స్వయంగా వచ్చి అక్షింతలు వేసి ఆశీర్వదిస్తానమ్మా... నేనే కాదమ్మా! మన బంధువులందర్ని తీసుకొస్తా నమ్మా! నీ పెళ్ళి రంగ రంగ వైభవంగా చేస్తానమ్మా! అవునమ్మా! నాతో మాట్లాడమ్మా! నన్ను నాన్నా అని పిలువమ్మా! ఆఁ! ఆఁ! పిలువమ్మా! ఇంకా... ఇంకా... మళ్ళీ పిలువమ్మా... మరొక్కసారి పిలువమ్మా..! ఏంటమ్మా ఎందుకేడుస్తున్నావు?... ఆఁ! ఆఁ!..... ఆఁ! ఏంటమ్మా నువ్వనేది... ఏంటి ఆఁ! ఆఁ! నిన్ను ఇంట్లోంచి వెళ్ళగొట్టాడా? నువ్వెవరో తెలీదు పొమ్మన్నాడా?... అమ్మా!.. పోనీలే అమ్మా ఏడొద్దు... నా తల్లి నువ్వేడ్వొద్దమ్మా.... నీ కంట నీరు చూడలేనమ్మా! ప్లీజ్ అమ్మా...... ప్లీజ్ నాన్నా! వచ్చెయ్యమ్మా... మనింటి కొచ్చెయ్యమ్మా!... నేనున్నానుతల్లీ! ఈ గుండెల్లో పెట్టుకొని నిన్ను కాపాడు కుంటానమ్మా... వచ్చెయమ్మా! అవును... ఎక్కడ నుండి మాట్లాడుతున్నావు. మన వీధి చివర క్లాక్ టవరుంది. దాని ప్రక్కన బంకుంది. ఆ బంకు నుండి మాట్లాడుతున్నావా? నువ్వక్కడే ఉండమ్మా! నేనిప్పుడే వస్తాను. నేనొస్తాను.. వద్దా... అయితే నువ్వే వచ్చెయ్యమ్మా! అలాగేనమ్మా! నీ కోసం ఎదురు చూస్తుంటాను. వెంటనే వచ్చెయ్యమ్మా! వెంటనే వచ్చేయ్! (ఫోన్ పెట్టేసాడు) (సింకు దగ్గరకు వెళ్ళి ముఖం కడుకుని కాస్త ఫ్రెష్ అయ్యాడు. ఒక్క రెండు నిమిషాల్లో శోభ వచ్చింది)

**శోభ :** నాన్నా! (ఏడుస్తూ వచ్చి తండ్రి గుండెలమీద వాలిపోయింది)

**చంద్ర :** ఏడొద్దమ్మా! నువ్వు ఏడొద్దు.

**శోభ :** గతి తప్పిన జీవితానికి ఏడుపు తప్ప ఇంకేముంటుంది నాన్నా!

**చంద్ర :** అమ్మా

**శోభ :** నాన్నా ఆ శివరాం నన్ను పూర్తిగా మోసం చేసాడు నాన్నా!

**చంద్ర :** ఇప్పుడేమయిందనమ్మా అంత బాధపడుతున్నావు.... వాడ్ని ప్రేమించి వెళ్ళావు – వాడి నిజ స్వరూపం తెల్సుకొని వచ్చేసావు – అంతే కదమ్మా

**శోభ :** లేదునాన్నా! నీ మీద కక్షతో వాడు నన్ను అన్నివిధాలా మోసం చేసాడు నాన్నా! .... నేనిప్పుడు గర్భవతిని.

**చంద్ర** : ఎందుకమ్మా ఇలా చేసావు. నీ తండ్రి నీకు పెళ్ళి చెయ్యలేదనుకున్నావా?

**శోభ** : కాదు నాన్నా! ముసురుకున్న మోహం తొలిగిపోయేసరికి అంతా అయిపోయింది నాన్న?

**చంద్ర** : నువు తిరిగొచ్చేసావు. అదే చాలు! వాడికెలా పాఠం చెప్పాలో నాకు తెలుసమ్మా!

**శోభ** : తప్పు మన దగ్గర పెట్టుకొని వాడినని లాభమేంటి నాన్న!

**చంద్ర** : అమ్మా!

**శోభ** : అవును నాన్నా! ఇంటి ముందు లానులో మొక్కల్ని చక్కగా తీర్చి దిద్దాలనుకుంటాము. ఆఖరుకు కుక్క పిల్లలు కూడా ఒక పద్ధతిలో పెరగాలనుకుంటారు. అలాంటిది మీ వారసుల పట్ల ఎందుకు నాన్న అంత నిర్లక్ష్యంగా ఉంటారు.

**చంద్ర** : తల్లీ!

**శోభ** : అవును. నాకు మంచి భోజనం పెట్టాలని చూసావు. ఖరీదైన బట్టలిచ్చావు. విలువైన నగలిచ్చావు. కానీ గొప్ప ఆలోచనలు వచ్చే పరిస్థితి ఎందుకు కల్పించలేదునాన్న!

**చంద్ర** : అదంతా నాతప్పేనమ్మా! నన్ను క్షమించమ్మా!

**శోభ** : తప్పయితే క్షమించొచ్చు. కానీ మీరు చేస్తున్నది నేరం నాన్న! ప్రేమ తనంత తానుగా పుడుతుంది. బాధ్యత మరొకరు తెలియజెయ్యాల్సిందే కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యతల్ని తెలియజెయ్యాల్సిన దశలో యువతను ప్రేమమత్తులో ముంచి దేశభవిష్యత్తును నాశనం చేస్తున్న చీడపురుగులు మీరు.

**చంద్ర** : అమ్మా!

**శోభ** : పాము విషానికి మనిషి చచ్చిపోతాడు. కానీ మీరు పెంచి పోషిస్తున్న విష సంస్కృతి వల్ల ఎంతమంది యువకులు నాశనమైపోతున్నారో ఆలోచించండి నాన్నా!

**చంద్ర** : అమ్మా! ఒక్కమాట చెప్తాను వింటావా?

**శోభ** : చెప్పునాన్న తప్పకుండా వింటాను.

**చంద్ర** : నా బంగారుతల్లీ!... మరేం లేదమ్మా! ఈ పాపాన్ని కడిగేసుకుంటే మిగిలిన జీవితం హాయిగా ఉండొచ్చు – పదమ్మా హాస్పటల్‌కి.

**చంద్ర** : అమ్మా! నేను చేసిన తప్పుకి ఇదిగో చెప్పు తీసుకుని కొట్టుకుంటున్నాను. పదమ్మా హాస్పటల్‌కి వెళ్దాం.

**శోభ** : ఎందుకు నాన్నా!

**చంద్ర :** నీకు అబార్షన్ చెయ్యించేసి

**శోభ :** ఆఁ! చెయ్యించేసి

**చంద్ర :** పెళ్ళి చేస్తానమ్మా!

**శోభ :** నీ కూతుర్ని గనుక అబార్షన్ చేయించేసి పెళ్ళి చేస్తారు. కోట్లు గడించడానికి మీరు సినిమాల్లో చూపించే ప్రేమలు, శృంగారాలు, పెద్దల్ని ఎదిరించి పారిపోవడాలులాంటివి నిజమనుకొని నమ్మి కొన్ని వేల మంది యువతీ యువకులు వాళ్ళ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారు. వాళ్ళందర్నీ ఏం జేస్తావు?

**చంద్ర :** ఏం చెయ్యమన్నా చేస్తాను. చెప్పమ్మా ఏం చెయ్యాలో!

**శోభ :** దేన్నయినా చెడగొట్టడమంత సులువు కాదునాన్నా సంస్కరించడం.

**చంద్ర :** నిజమే! ఈ ఒక్కసారి నా మాట వినమ్మా! ఇది తప్ప, ఇంక మిగిలిన జీవితమంతా మంచే జరుగుతుంది!

**శోభ :** జీవితమంటూ మిగిల్తే కదా నాన్న బ్రతకడానికి.

**చంద్ర :** ఏంటమ్మా నువ్వనేది.

**శోభ :** అదేనాన్న ఆడదానికి ప్రాణంకన్నా మానమే ముఖ్యం కదా!... సరేనాన్న! నీ ఇష్ట ప్రకారమే హాస్పటల్‌కి వెళ్దాం. రడీ అయి వస్తానుండు. (బాత్రూమ్‌లోకి వెళ్ళింది. చంద్రశేఖర్ ఫోన్జేసాడు.)

**చంద్ర :** హలో! డాక్టర్ సీతాలక్ష్మిగారా! ఆ నమస్తే అమ్మా! నేను ప్రొడ్యూసర్ చంద్రశేఖర్‌రావుని మాట్లాడుతున్నాను. ఆఁ! ఆఁ! మా అమ్మాయిని తీసుకొని వస్తున్నాను.... క్లీనిక్‌లో ఉంటారుకదా! వచ్చాక చెప్తాను... ఇప్పుడే రెండు నిమిషాల్లో వస్తున్నాం... ఒకే! (ఫోను పెట్టేసి వెనక్కి తిరిగాడు అప్పుడే లచ్చన్న వచ్చాడు)

**లచ్చు :** సార్! (బావురుమంటూ నడుంకి చుట్టుకుపోయాడు) సార్! అమ్మాయిగారూ!... అమ్మాయిగారూ!

**చంద్ర :** అమ్మాయి వచ్చి జరిగిందంతా చెప్పిందిరా!

**లచ్చు :** అమ్మాయిగారు రావడమేంటి సార్! మనందర్ని వదిలి....

**చంద్ర :** వదిలటమేంట్రా వెధవ! ఇప్పుడు హాస్పటల్‌కి తీసుకెళ్తున్నాను... అమ్మా శోభా! తొందరగా బయటకురామ్మా!

**లచ్చు :** అమ్మాయిగారి శవం.....

**చంద్ర :** (ఫట్‌మని కొట్టాడు) ప్రాణం తీస్తాను జాగ్రత్త! (తలుపుమీదకొట్టి) లేటయితే డాక్టర్ వెళ్ళిపోతుంది! రాత్వరగా!

**లచ్చు :** సార్! (బయట నుండి ఆగిశం, రైటర్ మరో నలుగురు వ్యక్తులు ఓ శవాన్ని మోసుకొచ్చారు – అది చూచి)

**చంద్ర :** ఏంటయ్యా అది! ఏంటలా మోసుకొస్తున్నారు.

**ఆ.ని :** అమ్మాయి క్లాక్ టవర్ పై నుండి దూకి ఇడిసిరోప్టా!

**చంద్ర :** మీకేమైనా పిచ్చా! అమ్మాయి ఇప్పుడు నాతో మాట్లాడి రెడీ అవడానికి లోనకెళ్ళిందయ్యా!

**రై :** సార్ ఘోరం జరిగిపోయింది. అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది.

**చంద్ర :** అమ్మా శోభ! (లోనకు పరుగెత్తాడు) అమ్మా! తల్లీ! శోభా అమ్మా నువు ఆత్మహత్య చేసుకున్నావంటున్నారమ్మా! బయటకురా! వచ్చి వీళ్ళకు కనిపించు. నువు కనిపిస్తే వాళ్ళు నోరు మూసుకుంటారు.

**ఆ.ని :** అమ్మాయి వచ్చినట్టు భ్రాంతి పడ్డాడు.

**రై :** ఏదో మనతో మాట్లాడుతున్నాడు గానీ..... మనిషి మాత్రం మనలో లేడు గమనించారా?

**చంద్ర :** కనిపించమ్మా! రామ్మా! కనిపించమ్మా!.....పలుకమ్మా! ఒక్కసారి నాన్నా అని పలుకమ్మా! నా బంగారు తల్లీ పలుకమ్మా! (బయటకొచ్చాడు – అప్పటికి శవాన్ని క్రిందన పెట్టి ముఖం మీద బట్ట తొలగించారు. ఆ ముఖాన్ని చూసి హిస్టిరిక్‌గా అరుస్తున్నాడు. పలకవా! నాన్నమీద కోపమొచ్చిందా? నేనిక చెడు సిన్మాలు తియ్యనమ్మా! ఎవరి జీవితాలతోనూ ఆడుకోనమ్మా! ఎవరిని తప్పుదారి పట్టించనమ్మా! డబ్బులేకపోతే రాళ్ళు మోసి బ్రతుకుతానమ్మా! రిక్షా తొక్కుకుని బ్రతుకుతానమ్మా! నాచిట్టి తల్లి ఒక్కసారి పలకవూ? ఒక్కసారి లేచి ఏంట్రా వెధవ ఇలాంటి సినిమాలు తీస్తావా అని ఖాండ్రించి నా ముఖం మీద ఉమ్మెయ్యవు. నీ కాలితో నా గుండెమీద తన్నవు! అమ్మా ఒక్కసారి ఈ నాన్నను చూడమ్మా!... ఈ నాన్నతో మాట్లాడమ్మా! మాట్లాడమ్మా! (కూతురి శవం మీద వాలిపోయాడు)

**ప్రయోక్త:** చిత్రమంటే రెండు గంటలపాటు మనిషిని మైమరిపించే విచిత్రం కాదు. మన సంస్కృతి, నాగరికతల ముఖచిత్రం – ఒక తరం మరో తరానికి అందించే విలువల శ్వేతపత్రం ఆలోచించండి!